ప్రజాశక్తి
విజయవాడ
సోమవారం
జనవరి-1
2018
12 పేజీలు


పుస్తక మహోత్సవానికి సిద్ధమవుతున్న స్టాల్

కోటి ఆశలతో...

- కొత్త సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు
- నగరంలో అంబరాన్నంటిన సంబరాలు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

నగరంలో ఆదివారం రాత్రి కొత్త సంవత్సర వేడుకల సంబరాలు అంబరాన్నంటాయి. కోటి ఆశలతో ప్రజలు 2017కి వీడ్కోలు పలికి 2018 నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. ఆనందోత్సాహాలతో, డ్యాన్సులు, కేరింతలతో నూతన సంవత్సర వేడుకల్లో అన్ని ప్రాంతాల ప్రజలు మునిగితేలారు. అర్ధరాత్రి 12 గంటలు దాటగానే ప్రజలు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. పరస్పరం కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపి ఆనంద డోలికల్లో తేలియాడారు. బంధుమిత్రులతో కలిసి న్యూఇయర్ కేక్‌లను కట్ చేశారు. యువత కేరింతలు, బైక్ ర్యాలీలతో ప్రధాన రహదారుల్లో పండుగ వాతావరణం కనిపించింది. నగరంలోని ఫన్‌టైమ్స్ క్లబ్‌లో నూతన సంవత్సర వేడుకలు ఉల్లాసంగా జరిగాయి. వేడుకలకు శాసన సభ్యులు గద్దె రామమోహన్, నగర మేయర్ కోనేరు శ్రీధర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సాంస్కృతిక మిగతా 4లో



హోటల్ మురళీ ఫార్చ్యూన్, ఫన్‌టైమ్స్ క్లబ్‌లో కార్యక్రమాలు

పుస్తక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి

- నేడు ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి, సిఎం
- 4న పుస్తక ప్రియుల పాదయాత్ర
- విద్యార్థులకు ప్రత్యేక ప్రతిభా పోటీలు
- సాంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే పుస్తక మహోత్సవం సోమవారం స్వరాజ్య మైదాన్‌లో ప్రారంభం కానుంది. 29వ విజయవాడ పుస్తక ప్రదర్శనను ఒకటో తేదీ ఉదయం 11 గంటలకు భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. స్వరాజ్య మైదాన్‌లో ప్రదర్శన ప్రారంభించిన అనంతరం ప్రారంభ సభ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. పుస్తక ప్రదర్శనలో 290 స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు మహోత్సవ సంఘం అధ్యక్షులు వెంకట నారాయణ, కార్యదర్శి కె.లక్ష్మయ్య తెలిపారు. జనవరి 1 నుండి 11వ తేదీ వరకు మధ్యాహ్నం 2 నుండి రాత్రి 10 గంటల వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రదర్శనలో పుస్తక ప్రియులకు కావాల్సిన విధంగా అన్ని రకాల పుస్తకాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాన పుస్తక మహోత్సవ ప్రాంగణానికి మహాలక్ష్మీ బుక్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత యు.ఎన్.యోగి పేరును, సాహిత్య వేదికకు చిత్తజల్లు వరహాలరావు (సీవీ) పేరును పెట్టినట్లు తెలిపారు. ప్రతి రోజూ సాహిత్య కార్యక్రమాలు, చర్చాగోష్టులు, పుస్తకా విష్కరణలు, రచయితలతో సమావేశాలు ఉంటాయన్నారు. ప్రతిభా వేదికపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

పుస్తక మహోత్సవ్ ప్రాంగణంలో సదస్సులతో పాటు ప్రత్యేకంగా సాహిత్య కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఒకటో తేదీన యు.ఎన్.యోగి సంస్మరణ సభ సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు నిర్వహించనున్నారు. సాయంత్రం 7 నుండి 9 గంటల వరకు 'నన్ను ప్రభావితం చేసిన పుస్తకం' మిగతా 4లో

తలసరి ఆదాయంలో ప్రగతి బాట

- వ్యవసాయ రంగంలో 20 శాతం వృద్ధి
- 2018లో దేశంలోనే అధిక వృద్ధి సాధనకు ప్రణాళికలు
- జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీకాంతం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ ప్రతినిధి

ప్రగతి బాటలు ప్రజల సంతోష సూచికలని, కృష్ణాజిల్లా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ, పారిశ్రామిక రంగాల్లో అనూహ్య ప్రగతి సాధిస్తోందని కలెక్టర్ బి.లక్ష్మీకాంతం తెలిపారు. సగటు తలసరి ఆదాయం రూ.1.61 లక్షల కోట్లతో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో నిలిచిందని పేర్కొన్నారు. 2018లో దేశంలోనే అత్యధిక వృద్ధి రేటు సాధనకు ప్రణాళికలు రూపొందించామన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత వృద్ధి, భవిష్యత్ వృద్ధి ప్రణాళికలను వివరించారు. గతేడాది స్థూల వస్తూత్పత్తి విలువ రూ.65 వేల కోట్లు కాగా ఈ ఏడాది 85 వేల కోట్లకు పెరిగిందన్నారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలు ఆక్వా, ఉద్యానవన ఉత్పత్తులు పెరగడం, వరి సాగు విస్తీర్ణంతో పాటు గతేడాది సగటు 28 బస్తాలను అధిగమించి ఈ ఏడాది ఎకరానికి 33 బస్తాలకు దిగుబడులు పెరిగాయన్నారు. నీటి యాజమాన్య పద్ధతులను అవలంభించడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. 2017-18లో ఆక్వా ఉత్పత్తులు లక్ష్యం 10.40 లక్షల టన్నులు కాగా ఈ ఏడాది ఇప్పటికే తొమ్మిది లక్షల టన్నులకు చేరడంతో 20 శాతంపైగా వృద్ధి సాధించామన్నారు. పారిశ్రామిక రంగ విస్తరణకు ఈ ఏడాది ముందడుగు పడిందన్నారు. 489 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేశామన్నారు. గన్నవరం నియోజకవర్గంలోని వీరపనేనిగూడెంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 75 ఎకరాలు, మల్లవల్లిలో అశోక్ లైలాండ్ సంస్థకు 75 ఎకరాల భూ కేటాయింపులు మిగతా 4లో

జిల్లాలో స్వచ్ఛభారత్ మిషన్ కింద లక్షా 57 వేల 290 మరుగుదొడ్లు నిర్మించి ఒడిఎఫ్‌గా ప్రకటించడంతో పాటు వీటిని వినియోగంలోకి తెచ్చేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జల వనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, జాయింట్ కలెక్టర్ విజయకృష్ణన్‌తో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

మరుగుదొడ్లపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

జిల్లాలో స్వచ్ఛభారత్ మిషన్ కింద లక్షా 57 వేల 290 మరుగుదొడ్లు నిర్మించి ఒడిఎఫ్‌గా ప్రకటించడంతో పాటు వీటిని వినియోగంలోకి తెచ్చేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆత్మగౌరవ దీక్షలో భాగంగా విజయవాడ కలెక్టర్ కార్యాలయం నుండి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, జాయింట్ కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ఆత్మగౌరవ దీక్ష నినాదాలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి వర్యులు మాట్లాడుతూ జిల్లాలోని 970 గ్రామ పంచాయితీలో 6 లక్షల 15వేల 692 గృహాల లబ్ధిదారులకు లక్ష 57 వేల 290 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. వీటిని అలంకార ప్రాయంగా కాకుండా పూర్తి వినియోగంలోకి తెచ్చేలా పెద్ద ఎత్తున పాఠశాల, కళాశాల విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో చెంబు చచ్చింది వంటి ఆత్మగౌరవం నినాదాలతో కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ చక్కటి ఆరోగ్యం పరిశుభ్రమైన వాతావరణం కల్పించే దిశగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఒడిఎఫ్ రాష్ట్రంగా అండమాన్ నికోబార్ మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందన్నారు. వచ్చే మార్చి నాటికి రాష్ట్రాన్ని ఒడిఎఫ్‌గా ప్రకటించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



అవగాహనా ర్యాలీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ లక్ష్మీకాంతం



ఇస్త్రీ బండిని అందజేస్తున్న ఉమా

ఇస్త్రీ బండి అందజేత

ప్రజాశక్తి - విజయవాడ

సెంట్రల్ నియోజకవర్గం 20వ డివిజన్‌లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా ఇస్త్రీ బండి పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నడిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా డివిజన్లలో పేద ప్రజలకు పలు రూపాల్లో సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు. కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రజల ఇబ్బందులను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, కార్పొరేటర్ కోసూరు శైలజ, టిడిపి అనుబంధ బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కొసూరు సుబ్రహ్మణ్యం (మణి), డివిజన్ అధ్యక్షులు సుబ్బారావు, సెక్రటరీ నరసింహారావు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటింటికీ టిడిపి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

9వ డివిజన్‌లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ఆదివారం సాయంత్రంతో ఘనంగా ముగిసిందని డివిజన్ పార్టీ అధ్యక్షులు కోనేరు రాజేష్ తెలిపారు. ఆదివారం ఉదయం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి డివిజన్ వాసుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించినట్లు తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం శాసన సభ్యులు గద్దె రామమోహన్‌రావు ప్రోత్సాహంతో డివిజన్ పార్టీ కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ప్రసాద్, బొడ్డు రవికిరణ్, మేకా రాము, ఎస్.సూరిబాబు, ఎ.అమ్మారావు, ఎస్.నరహరి, సి.హెచ్.రామకృష్ణ, దాసరి రాఘవేంద్రరావు, కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికీ టిడిపిలో నాయకులు, కార్యకర్తలు

పలు రైళ్ల గడువు పొడిగింపు

ప్రజాశక్తి - గాంధీనగర్

రైలు ప్రయాణికుల రద్దీ నివారించేందుకు పలు ప్రత్యేక రైళ్లను ఈ నెల నాలుగు నుంచి (జనవరి) ఏప్రిల్ రెండు వరకు వారాంతపు రైల్లును పొడిగించినట్లు దక్షిణమధ్య రైల్వే అధికారి ఎం.ఉమాశంకర్ కుమార్ తెలిపారు.

గౌహతి-తంబరం

15,630 రైలు ప్రతీ శుక్రవారం రాత్రి 8.05 గంటలకు గౌహతిలో బయల్దేరి, ఆదివారం రాత్రి 9.15గంటలకు టంబరం చేరుతుంది. 15,629 రైలు ప్రతీ సోమవారం రాత్రి 9.15 గంటలకు తంబరంలో బయల్దేరి బుధవారం తెల్లవారి 4.25 గంటలకు గౌహతి చేరుతుంది. సుమారు 54 గంటలు ప్రయాణిస్తుంది.

దిబ్రూఘర్ - తంబరం

15930 రైలు ప్రతీ ఆదివారం రాత్రి 11.45 గంటలకు దిబ్రూఘర్‌లో బయల్దేరి, బుధవారం రాత్రి 9.15 గంటలకు తంబరం చేరుతుంది. 15929 రైలు తంబరంలో ప్రతీ గురువారం రాత్రి 9.45 గంటలకు బయల్దేరి, ఆదివారం సాయంత్రం 6 గంలకు దిబ్రూఘర్ చేరుతుంది. ఈ రైలు సుమారు 70 గంటలు పట్టాలపై పరుగులు పెడుతుంది.



క్యాలెండర్ ఆవిష్కరణ

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ

సింగ్‌నగర్‌లో వెలమ సంఘం ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ ఆదివారం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని పింఛన్లు అందజేశారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెలమ సంఘం వారు పింఛన్లు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ గోగుల వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు. సింగ్‌నగర్ సెంట్రల్ టిడిపి ఆఫీసులో సెంట్రల్ యెల్లో ఆర్మీ వారి 2018 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఉపాధ్యక్షులు ఘంటా కృష్ణమోహన్, యెల్లో ఆర్మీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి సిఐటియు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సత్యనారాయణపురం

ఇటీవల అనారోగ్యంతో మరణించిన సెంట్రింగ్ వర్క్ చేసే తెల్లాకుల సత్తిబాబు కుటుంబానికి సిఐటియు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. 53వ డివిజన్ పాత మసీదు వద్ద నివాసం ఉండే సత్తిబాబు కుటుంబాన్ని కలిసి ఆదివారం పది వేల రూపాయల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఎస్.కె.మీరావలీ, సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు, నాయకులు పి.మాధవ్, పి.వి.సుబ్బారావు, కె.దుర్గాప్రసాద్, బి.జనార్ధన్, కె.మణి, పి.కేశవ తదితరులు ఉన్నారు.



నగదు అందజేస్తున్న సిఐటియు నాయకులు

బాధితులకు చంద్రన్న బీమా సొమ్ము

విజయవాడ : ఇటీవల మృతిచెందిన ఏరికిపాటి.దయామయుడు కుటుంబానికి 2 లక్షలు చంద్రన్న బీమా అందజేసినట్లు గ్రామ పార్టీ అధ్యక్షులు అబ్దుల్ గౌస్ తెలిపారు. అందజేసిన వారిలో చంద్రన్న బీమా మిత్ర ఏజెంట్ సుజాత, డ్వాక్రా బుక్ కీపర్ అమీనా ఉన్నారు. ఈ కార్య క్రమం లో గ్రామ పార్టీ అధ్య క్షులు ఇర్ఫాన్ పాషా ఖాసీం, జోజి బా బు, బంగార య్య పాల్గొన్నారు.




బాధితులకు నగదు అందజేస్తున్న నాయకులు

రేపటి నుంచి 'జన్మభూమి - మా ఊరు'

సెంట్రల్ నియోజకవర్గంలో 2 నుంచి 11 వరకు

ప్రజాశక్తి - విజయవాడ

ఈ నెల 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరిగే ఐదవ విడత 'జన్మభూమి–మా ఊరు' కార్యక్రమానికి నగరపాలక సంస్థ అధికారులు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గాల వారీగా ఇప్పటికే జన్మభూమి షెడ్యూల్‌ను విడుదల చేశారు. సెంట్రల్ నియోజకవర్గంలో జరిగే 'జన్మభూమి– మా ఊరు' కార్యక్రమం వివరాల ప్రకారం... తొలి రోజు ఈ నెల రెండో తేదీన (మంగళవారం) 42వ డివిజన్‌లోని కందుకూరు కళ్యాణమండపంలో జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 44వ డివిజన్ శ్రీనగర్ కాలనీలోని ఇఎల్‌ఎస్ఆర్ కాంపౌండ్‌లో నడుస్తుంది. 3వ తేదీ ఉదయం 45వ డివిజన్ మధురానగర్ రిజర్వాయర్ సెంటర్‌లో నడుస్తుంది. అదే రోజు మధ్యాహ్నం (గం.11.15)లకు ముత్యాలంపాడులోని జిఎస్ఆర్ మునిసిపల్ స్కూల్లో జరుగుతుంది. 5న 19వ డివిజన్ కర్నాట రామమోహన్ మునిసిపల్ స్కూల్లో సాయంత్రం 4 గంటలకు నడుస్తుంది. 6వ తేదీన 43వ డివిజన్ దుర్గాపురం టివిఆర్ మునిసిపల్ స్కూల్లో ఉదయం నడుస్తుంది. 8న 47వ డివిజన్ సత్యనారాయణపురంలోని ఎకెటిపిఎం స్కూల్లో ఉదయం, అదే రోజు సాయంత్రం 51వ డివిజన్‌లోని అయోధ్యనగర్‌లోని సూర్య పబ్లిక్ స్కూల్లో నడుస్తుంది.



11వ తేదీన 21వ డివిజన్ సూర్యారావుపేటలోని సివిఆర్ మునిసిపల్ హైస్కూల్లో ఉదయం జరుగుతుంది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.గంగరాజు 3వ టీమ్‌కు లీడర్‌గా వ్యవహరిస్తారు. ఈయన సెల్ నెంబర్: 9866514186.

4వ తేదీన 52వ డివిజన్ ఆర్ఆర్ పేట వాటర్ ట్యాంక్ సమీపంలోని కేర్ అండ్ షేర్ స్కూల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. అదే రోజు మధ్యాహ్నం 54వ డివిజన్ అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎంబిపి స్టేడియంలో జన్మభూమి జరుగుతుంది. 5వ తేదీ ఉదయం 56వ డివిజన్ వాంబేకాలనీలోని సి బ్లాక్ అపార్ట్‌మెంట్ గ్రౌండ్‌లో నడుస్తుంది. అదే రోజు మధ్యాహ్నం 58వ డివిజన్ రాజీవ్‌నగర్‌లోని కమ్యూనిటీ హాలులో జరుగుతుంది. 9వ తేదీన 53వ డివిజన్ రామకృష్ణాపురం సమీపంలోని కళ్లేపల్లి లైబ్రరీలో ఉదయం జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 55వ డివిజన్ అజిత్‌సింగ్‌నగర్‌లోని షాదీఖానాలో నడుస్తుంది. 10వ తేదీన 57వ డివిజన్‌లోని ఎల్‌బిఎస్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్లో జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 59వ డివిజన్ ఎన్ఎస్‌సి బోస్‌నగర్‌లోని బివి సుబ్బారెడ్డి స్కూల్లో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి టీమ్ లీడర్‌గా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.గుర్నాథబాబు వ్యవహరిస్తారు. ఈయన ఫోన్ నెంబర్... 9866514186.

మూడో తేదీ సాయంత్రం ఒకటవ డివిజన్‌లోని సంగం రోడ్డులోని మర్రిచెట్టు సెంటర్‌లో నడుస్తుంది. 4వ తేదీ సాయంత్రం ఐదో డివిజన్ ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కాలేజీలో జరుగుతుంది. ఆరవ తేదీ సాయంత్రం 20వ డివిజన్ అరండల్‌పేటలోని అబ్దుల్‌కలాం మునిసిపల్ ఉర్దూ స్కూల్లో జన్మభూమి కార్యక్రమం జరుగుతుంది. దీనికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె నారాయణమూర్తి వ్యవహరిస్తారు. ఈయన సెల్ నెంబర్: 9866514202.

ఉపాధ్యాయుల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఎల్‌ఎ బోడె ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియు), పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు మండలాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నూతన డైరీ, క్యాలండర్లను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు.

జూదరుల అరెస్టు

జి.కొండూరు : మండలంలోని తెల్లదేవ రాపాడు, పినపాక గ్రామాలలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై ఎస్‌ఐ డి.రాజేష్ సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. తెల్లదేవరపాడులో పది మందిని పందెపు రాయళ్లను అదుపులోకి తీసుకొని వారి నుండి కోడిపుంజును, రూ.2,750 నగదును స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. పినపాకలో ఎనిమిది మంది పందెపు రాయళ్లను అదుపులోకి తీసుకని వారి నుండి కోడిపుంజును, రూ.2,565 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జూదగాళ్లను కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నందిగామ: 65వ నెంబర్ జాతీయ రహదారిపై నందిగామ శివారు అనాసాగరం క్రాస్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాడపడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. విజయవాడకు చెందిన బోరంగ ధవళేశ్వరావు మోటారు బైకుపై విజయవాడ నుండి హైదరాబాదు వెళుతుండగా అనాసాగరం క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ధవళేశ్వరావు తీవ్రంగా గాయపడగా వెంటనే విజయవాడ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు.

వరి గడ్డి వామి దగ్ధం

నందిగామ : మండలంలోని హనుమంతుపాలెం గ్రామంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు వరి గడ్డి వామిని దగ్ధం చేశారు. ఎస్‌సి కాలనీకి చెందిన నెమలి వీరయ్య చెందిన వరిగడ్డి వాముపై నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో సుమారు 50 వేలు ఆస్తి నష్టం సంభవించింది. అగ్నిమాపక శాఖ అధికారులు రంగంలోకి దిగి మంటలను ఆర్పి వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - పెనమలూరు, కంకిపాడు

ఉపాధ్యాయుల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఎల్‌ఎ బోడె ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియు), పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు మండలాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నూతన డైరీ, క్యాలండర్లను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పట్ల ఎస్‌టియు సంఘం చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి బొగ్గవరపు శ్రీనివాసరావు, ఎంపిపి బొర్రా కనకదుర్గ, ఆ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మండవ గౌరీ ప్రసాద్, కంకిపాడు టీచర్స్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు ఇమ్మానుయేలు, జిల్లా ఉపాధ్యక్షులు మండవ శ్రీనివాస్, మండల నాయకులు ముతహర్ ఆలీ, విజయకుమార్, శ్రీనివాసమూర్తి, కష్ట మోహన్,కె.వెంకటేశ్వరరెడ్డి, ఎ.సత్యవంతు, టైటస్‌పాల్, యలమంచలి శ్రీకాంత్, సిహెచ్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దొంగనోట్ల ముఠా అరెస్టు



మోసం చేసే విధానాన్ని వివరిస్తున్న నిందితులు

నూజివీడు: తెలుగు రాష్ట్రాల్లో పలు మోసాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను డిఎస్పీ ఆదేశాల మేరకు ముసునూరు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... ఒకటికి మూడు రెట్లు దొంగనోట్లు ఇస్తామని నమ్మించి అమాయకుల వద్ద అసలు నోట్లు తీసుకుని ఉడాయించిన నిందితులను నూజివీడు డిఎస్పీ వల్లూరి శ్రీనివాసరావు ఆదివారం నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ప్రవేశపెట్టారు. డిఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం వేంసూరు పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు గ్రూపుగా ఏర్పడి అమాయకులను, అత్యాశాపరులను ఒకటికి మూడు రెట్లు దొంగ నోట్లు ఇస్తామని గత కొంత కాలంగా నమ్మిస్తున్నారు. ఈ నేపధ్యంలో ముసునూరు మండలం చిల్లబోయినపల్లికి చెందిన భీమడోలు ప్రకాశం అనే అతని వద్ద జూపూడి ఏసురత్నం, షేక్.గుంషావలీ, రామిశెట్టి నరేష్, షేక్.నాగుల్ మీరాలు సుమారు రెండు నెలల క్రితం నమ్మించి రూ.6 లక్షల 33 వేలు తీసుకుని ఎటువంటి నకిలీ నోట్లు ఇవ్వకుండా మోసగించారు. అయితే నిందితులు ఎపి 20 టిబి 4685 గల ఆటోలో చెక్కపల్లి లోపూడి వెళ్తున్నట్లు ముసునూరు ఎస్‌ఐ శ్రీమన్నారాయణకు సమాచారం అందింది. దీంతో ఆదివారం ఎస్‌ఐ తన సిబ్బందితో నిందితులను అరెస్టు చేశారు. అనంతరం డిఎస్పీ వద్ద నిందితులను విలేకరుల ఎదుట ప్రవేశపెట్టారు. అయితే జూపూడి ఏసురత్నం వి.ఎం.బంజర్, సత్తుపల్లి, కోదాడ, తిరువూరు, వేంసూరు పోలీస్ స్టేషన్‌లో ఒక్కొక్క కేసు ఉండగా షేక్.గుంషావలీకి ఖమ్మం జిల్లాలో 11 కేసులు, విజయవాడలో ఒక కేసు ఉన్నాయి. షేక్.నాగుల్ మీరాకు ఖమ్మం జిల్లాలో ఒక కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి–జి.కొండూరు

ఈనెల 30వ తేదీన మైలవరం శివారు దర్గా వద్ద జరిగిన కారు ఆటోను ఢీకొట్టిన సంఘటనలో మందా రూతమ్మ(40) విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె మృతదేహన్ని పోస్టు మార్టం అనంతరం ఆదివారం జి.కొండూరు మండలం శివారు శేగిరెడ్డిపాడుకు తీసుకొచ్చి దహన సంస్కారాలు చేశారు. బూబురావు, రూతమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో కూతురు రాజేశ్వరీ కూడా మృతిచెందిన విషయం విధితమే. ఒకే కుటుంబంలో తల్లీ కూతురు మరణించడం పట్ల బంధువులు, కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. గ్రామంలో విషాదచాయిలు అలుముకున్నాయి. వైసిపి అధికార ప్రతినిధి రమేస్, ఎంపిపి వేములకొండ తిరుపతిరా వు, మండల కన్వీనర్ మందా జక్రధరరావు ఆదివారం రూతమ్మ భౌతికగాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మృతుడు భాషా

ఆర్‌టిసి బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వన్‌టౌన్

పాల ఫ్యాక్టరీ ఫైవంతెన వద్ద ఆదివారం సాయంత్రం ఆర్‌టిసి బస్సు ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన ఘటన రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పాల ఫ్యాక్టరీ నుండి జక్కంపూడి కాలనీకి వెళుతున్న ఆర్‌టిసి బస్సు ఎదురుగా వస్తున్న ఎపి 16సిజెడ్ 2185 నెంబరు గల ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న భాషా (35) పూర్ణానందంపేట నివాసి అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనంపై ఉన్న మరో వ్యక్తి షేక్.ఖాజా హెల్మెట్ ధరించడంతో స్వల్ప గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి మృతుడిని గవర్నమెంటు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

వత్సవాయి : గ్రామాల్లో కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వత్సవాయి ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని మంగొల్లు గ్రామంలో కోడి పందాలు నిర్వహించే నిర్వాహకులను ముందస్తుగా పిలిపించి వారికి హెచ్చరికలు జారీ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు ఆడిస్తే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రాత్రి వేళల్లో పది గంటల నుండి అర్ధరాత్రి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి పట్టుబడ్డ వ్యక్తుల వాహనాలను స్వాధీనం చేసుకుంటామని అన్నారు. ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

కోడి గుడ్డు ధరలు

విజయవాడ	హైదరాబాద్	ప.గోదావరి
రూ.3.43	రూ.3.30	రూ.3.43
విశాఖ	**చెన్నై**	**నామకల్**
రూ.3.43	రూ.3.75	రూ.4.05

కోడి మాంసం ధరలు

రకం	స్కిన్‌లెస్	విత్ స్కిన్
బ్రాయిలర్	175.00	148.00

వాతావరణం

విజయవాడ	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని	ఆది
గరిష్టం	32	32	31	31	31	30	30
కనిష్టం	17	18	19	19	19	18	17

బులియన్ మార్కెట్

24 క్యారెట్లు	: 2,961 (గ్రాము)	: 29,610 (10గ్రా)
22 క్యారెట్లు	: 2,773 (గ్రాము)	: 27,730 (10గ్రా)
వెండి	: 40.64 (గ్రాము)	: 40,640

మీరే రిపోర్టర్ అయితే?

(సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు)

ప్రాంతం	నెంబరు
సిటీ ప్రతినిధి	9491454756
అర్బన్ ప్రతినిది	9490099630
విజయవాడ	9490099652
విజయవాడ అర్బన్	9966108515
భవానీపురం	9912026686
గాంధీనగర్	9492334747
గన్నవరం	9492525256
కంకిపాడు	9030747978
గవర్నర్‌పేట	9032099986
మొఘల్రాజపురం	9492825220
సత్యనారాయణపురం	8886782790
ఇబ్రహీంపట్నం	7675969621

ప్రభుత్వాసుపత్రిలో నేడు ఓపీ వివరాలు

ప్రజాశక్తి - హెల్త్‌యూనివర్శిటీ

నగరంలోని పాత, కొత్త ప్రభుత్వాసుపత్రులలో ఉదయం 8.00 గంటల నుండి 11 గంటల వరకు ఓపి చీటీలను రోగులకు అందజేస్తారు.

కొత్త ప్రభుత్వ ఆసుపత్రి
జనరల్ మెడిసిన్ : డాక్టర్ వెంకటకృష్ణ, సాయిలక్ష్మీ, బాల నరసింహులు, డాక్టర్ శశిధర్
జనరల్ సర్జరీ : డాక్టర్ జె.సాంబశివరావు, డాక్టర్ డి.విజయలక్ష్మి
ఆర్థోపెడిక్ : డాక్టర్ అద్దేపల్లి శ్రీనివాసరావు, పవన్‌కుమార్
చర్మవ్యాధులు : డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ గంగాభవానీ, పూర్ణిమ, డాక్టర్ రాజగోపాల్
పాత ప్రభుత్వ ఆసుపత్రిలో ...
మానసిక వ్యాధులు : డాక్టర్ వి.రాధికారెడ్డి,
కంటి వ్యాధులు: డాక్టర్ రాజ్‌కుమార్, మాధవీలత, డాక్టర్ పిపి శాస్త్రి.
ఇఎన్‌టి విభాగం : డాక్టర్ సుధీర్‌బాబు, డాక్టర్ స్వరూప్,
పిల్లల విభాగం : డాక్టర్ ఎం.ఎ.రెహమాన్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ మురళీకృష్ణ
ప్రసూతి విభాగం : డాక్టర్ వి.ఇందిరాకుమారి, డాక్టర్ రేవతి, డాక్టర్ రత్న, డాక్టర్ కరుణావతి

రైతు బజారులో కూరగాయల ధరలు

(కిలో.. రూ..లలో) (నిన్నటి ధరలు)

టమాటో	10	బీన్స్	34
వంకాయ	17	కాప్సికం	42
బెండ	26	చింత	24
పచ్చిమిర్చి	16	గుమ్మడి	15
కాకర	18	బూడిదగుమ్మడి	15
బీర	24	ఉసిరి	36
క్యారెట్	35	గోంగూర	50
దొండ	14	చిలగడదుంప	20
బంగాళదుంప	12	పెండలం	20
ఉల్లి	38	బొప్పాయి	22
గోరుచిక్కుళ్లు	20	వేరుశనగ	60
దోస	18	కొత్తిమీర	5
పెద్దసొర	8	పుదీనా	2
చిక్కుళ్లు	30	మామిడి	20
చామదుంప	33	అరటి	5
అల్లం	36	క్యాలీఫ్లవర్	10
వెల్లుల్లి	52	క్యాబేజీ	12
కంద	24	మునగ	10
బీట్రూట్	23	ఆకుకూరలు	1.50
కీరదోస	12	నిమ్మ	12

ప్రతిఒక్కరూ సేవాతత్వాన్ని అలవర్చుకోవాలని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉంగుటూరుకు చెందిన రాధికరాయుడు స్పెషాలిటీ హస్పిటల్ వారి సౌజన్యంతో చెవుడు, మూగ పిల్లలకు ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు.

మొదటిపేజీ తరువాయి

పుస్తక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి

అనే అంశంపై సదస్సు జరుగుతుంది. రెండో తేదీన తెలుగుభాష – వికాసం అనే అంశంపై సదస్సు జరుగుతుంది. ఈ కార్యక్రమానికి శాసన మండలి సభ్యులు డొక్కా మాణిక్యవరప్రసాద్ పాల్గొనున్నారు. మూడో తేదీన 'సాహితీ సృజనలో స్త్రీలు' అనే అంశంపై ప్రముఖ రచయిత్రి ఓల్గా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సదస్సు జరుగుతుంది. నాల్గో తేదీన డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ టాక్ షో ఉంటుంది. ఐదో తేదీన కథ అనే అంశంపై సాహిత్య సదస్సు, ఆరో తేదీన తెలుగు సాహిత్యంలో హాస్యం 'నవ్వుల పందిరి' అనే అంశంపై ప్రత్యేక సదస్సు జరుగనుంది.

4న పుస్తక ప్రియుల పాదయాత్ర

నాల్గో తేదీన పుస్తక ప్రియుల పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పుస్తక ప్రియులు, పుస్తకాభిమానులు పాల్గొంటారు. పాదయాత్ర గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్ నుండి స్వరాజ్యమైదాన్‌లోని పుస్తక మహోత్సవ్ ప్రాంగణం వరకు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ పాత్రికేయులు ఎస్.వెంకటనారాయణ, సాంస్కృతిక, పర్యాటక శాఖా మంత్రి భూమా అఖిల ప్రియ, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ పాల్గొనున్నారు.

పుస్తకావిష్కరణలు

పుస్తక మహోత్సవ్‌లో పుస్తకావిష్కరణలకు పెద్ద పీట వేయనున్నారు. ప్రతి ఏటా పుస్తక మహోత్సవ్‌లో కొత్త పుస్తకాలను ఆవిష్కరిస్తారు. ఇందులో భాగంగా జనవరి 2వ తేదీ నుండి 11వ తేదీ వరకు ప్రతిరోజూ రెండు పుస్తకాలను ఆవిష్కరించనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మ్యాజిక్‌షో, మిమిక్రీ, ట్రాక్ సింగింగ్, వెంట్రిలాక్విజం, గేమ్స్ షో, డ్యాన్స్ వంటి కార్యక్రమాలు ఉంటాయి.

తలసరి ఆదాయంలో ప్రగతి బాట

పూర్తయ్యాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయన్నారు. పట్టీసీమ నీటి ద్వారా సాగు విస్తీర్ణం పెరిగిందని, వచ్చే ఏడాది చింతలపూడి ప్రాజెక్టు ద్వారా మరింతగా సాగు విస్తీర్ణంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను పెంచుతామని చెప్పారు. పర్యాటక విస్తరణకు జనవరి 28న ఫెలికాన్ ఫెస్టివల్, ఫిబ్రవరి ఐదు, ఆరు, ఏడు తేదీల్లో రెండు వేల మంది బౌద్ధ బిక్షువులతో బుద్ధం శరణం గచ్ఛామీ, ఏప్రిల్‌లో 45 రోజులు పాటు ఎగ్జిబిషన్ నిర్వహిస్తామన్నారు. పున్నమి ఘాట్ నుంచి పవిత్ర సంగమం వరకు సైకిల్, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. పవిత్ర సంగమం వద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. జనవరి 20 నుంచి గన్నవరం విమానాశ్రయం నుంచి ముంబాయ్, దుబాయ్‌లకు ఎయిర్ ఇండియా విమాన సర్వీసులు ప్రారంభమవుతాయన్నారు. విజయవాడ– మచిలీపట్నం రోడ్డు విస్తరణ ఈ ఏడాది జూన్‌కు పూర్తవుతుందని తెలిపారు. బెంజి సర్కిల్ వద్ద ఫ్లైవోవర్‌ను నిడమానూరు వరకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయన్నారు.

కోటి ఆశలతో...

కార్యక్రమాలు అలరించాయి. ఎం.జి.రోడ్డులోని హోటల్ ఫార్చ్యూన్ మురళి హోటల్‌లో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని తాకాయి. పలువురు డ్యాన్సర్లతో డిజె మ్యూజిక్ సందడి చేసింది. రెస్టారెంట్లు, హోటళ్లలో విపరీతమైన రద్దీ కనిపించింది. వర్తక, వాణిజ్య వ్యాపారులకు న్యూఇయర్ కాసుల పంట కురిపించింది.



నూతన సంవత్సరం సందర్భంగా మహాత్మాగాంధీ రోడ్డులో స్వీట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

సేవాతత్వాన్ని అలవర్చుకోవాలి

ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి- ఉంగుటూరు

ప్రతిఒక్కరూ సేవాతత్వాన్ని అలవర్చుకోవాలని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉంగుటూరుకు చెందిన రాధికరాయుడు స్పెషాలిటీ హస్పిటల్ వారి సౌజన్యంతో చెవుడు, మూగ పిల్లలకు ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల అంగ వైకల్యాన్ని చిన్నతనంలోనే గమనించి వైద్యం చేయిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. పిల్లలకు చెవుడు, మూగ అంగవైకల్యం ఉన్నవారు స్వర్ణభారత్ ట్రస్ట్‌ను సంప్రదిస్తే వారికి వైద్య సదుపాయాలు అందిస్తామని వివరించారు. ఆర్థికంగా స్థిరపడిన ప్రతి వారు తోటి మనిషికి తమ వంతు తోడ్పాటునందించాలని కోరారు. యువతకు ఉపాధి అంశాల్లో శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ కార్యక్రమాలు హర్షణీయమన్నారు. ఏడాదికాలంలో స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో వివిధ ఉపాధి అంశాల్లో 2,300 మంది యువతకు శిక్షణ ఇచ్చి, 2,100 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించటం సంతోషదాయకమని అన్నారు. మూడు నెలలుగా ట్రస్ట్‌లో ఆంధ్రాబ్యాంకు, జిఎంఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 79 మందికి, అబ్దుల్‌కలాం నైపుణ్య శిక్షణా కేంద్రంలో ఇండియన్ బ్యాంకు సహకారంతో 109 మందికి వివిధ ఉపాధి అంశాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ధృవీకరణ పత్రాలు, ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ప్రజలకు 2018 సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వర్ణభారత్,ఎలీప్ మరియు మేనేజ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆగ్రి క్లినిక్స్ అండ్ అగ్రి బిజినెస్ కేంద్రాల శిక్షణా కార్యక్రమం ఏర్పాటుపై తయారు చేసిన బ్రోచర్‌ను లాంఛనంగా బ్రోచ ర్‌ను ఆవిష్కరించారు. మంత్రి కామినేని శ్రీనివాస్, ట్రస్ట్ అధ్యక్షులు ఎం.ప్రభాకరరావు, కార్యదర్శి సిహెచ్ వరప్రసాద్, విశ్వనాథం, ఎంపి కొనకళ్ల నారాయణ, డాక్టర్ రాజారావు, పాల్గొన్నారు.

ఏడుగురికి వినికిడి పరికరాలు

గుంటూరు రాధిక రాయుడు స్పెషాలిటీ ఆసుపత్రిలో ఇటీవల వినికిడి లోపం కలిగిన 7గురు చిన్నారులకు శస్త్రచికిత్స పొందిన వారికి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా వినికిడి యంత్రాలు(కాక్లియర్ ఇంప్లాంటేషన్) అందజేశారు. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న వైద్యమని దీనికి ప్రభుత్వాలు తమ సహకారం అందించాలన్నారు. ఇంతకు ముందు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇటువంటి శస్త్ర చికిత్సలు చేయించారని, అదేబాటలో సిఎం చంద్రబాబు దాన్ని కొనసాగిస్తున్నారన్నారు. డాక్టర్ వై.సుబ్బారాయుడు, తదితరులు పాల్గొని వైద్యసేవలు అందజేశారు.

ఆత్మగౌరవ దీక్ష బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-ఉంగుటూరు

ఆత్మగౌరదీక్ష 13వ రోజులో భాగంగా ఉంగుటూరు మండలం ఆత్కూరులో జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం ఆదివారం బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయు డును కుటుంబ సమేతంగా కలిసిన జిల్లా కలెక్టర్ అనంత రం బైక్‌ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం మరుగుదొడ్డి నిర్మించుకుని దాన్ని వినియోగించుకునేలా వారిని చైతన్యవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, ఎంపిడిఒ పిఎస్ఆర్ ప్రసాద్, తహశీల్దార్ ఎం.శ్రీనివాసు, ఇఒపిఆర్‌డి ముత్తవరపు నరసింహారావు, వివిధ శాఖల మండలస్థాయి అధికారులు, గ్రామకార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీకాంతం

8 నుంచి సిపిఐ జాతీయ సమావేశాలు

ప్రజాశక్తి - మచిలీపట్నం

జనవరి 8, 9, 10 తేదీల్లో విజయవాడలో జరిగే సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మోదుమూడి రామారావు కోరారు. స్థానిక మోదుమూడి శ్రీహరిరావు భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10వ తేదీ విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరిగే బహిరంగసభను జయప్రదం చేయాలన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శులు సురవరం సుధాకరరెడ్డి, డి.రాజా, కె.నారాయణ, అమర్‌జిత్‌కేర్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారన్నారు. నియోజకవర్గ కార్యదర్శి జంపాన వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి యర్రంశెట్టి ఈశ్వరరావు, కరపాటి సత్యనారాయణ, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ రంగుల మహోత్సవం

పెనుగంచిప్రోలు: 8వ తేదీన నిర్వహించనున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి రంగుల మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆలయ సంయుక్త కమిషనర్ ఎం రఘునాథ్, చైర్మన్ కర్ల వెంకటనారాయణలు పేర్కొన్నారు. స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం దర్మకర్తల మండలి సమావేశం ఆదివారం చైర్మన్ చాంబర్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి రంగుల మహోత్సవం, పెద్దతిరునాళ్ళు, అమ్మవారి కళ్యాణ మహోత్సవం చిన తిరునాళ్ల మహోత్సవాలకు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబందించి సమావేశంలో చర్చించి తీర్మానం చేశారు. పెదతిరునాళ్లకు సంబంధించి రూ.40లక్షలు, చిన తిరునాళ్ళకు సంబంధించి రూ.30లక్షల వ్యయంతో వివిధ నిర్మాణాలు చేపట్టేందుకు ధర్మకర్తల మండలి తీర్మానం చేశారు.

గన్నవరం నుంచి విమానాలు బయలుదేరు వేళలు



న్యూఢిల్లీకి	సమయం	వారం
ఎయిరిండియా	09.05	ప్రతిరోజూ
ఎయిరిండియా	17.20	ప్రతిరోజూ
ఎయిరిండియా	20.40	ప్రతిరోజూ
హైదరాబాద్‌కు		
స్పైస్‌జెట్	09.35	ప్రతిరోజూ
ఎయిరిండియా	13.20	బుధవారం మాత్రమే
స్పైస్‌జెట్	14.40	మంగళవారం మినహా
ఎయిరిండియా	17.20	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	17.35	ప్రతిరోజూ
ట్రూజెట్	21.55	ప్రతిరోజూ
బెంగళూరుకు		
స్పైస్‌జెట్	07.55	మంగళవారం మినహా
స్పైస్‌జెట్	20.00	ప్రతిరోజు
చెన్నైకు		
ట్రూజెట్	07.55	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	16.10	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	14.00	మంగళవారం మాత్రమే
స్పైస్‌జెట్	20.00	ప్రతిరోజు(వయా బెంగుళూరు)
తిరుపతికి		
ఎయరిండియా	07.55	బుధవారం మినహా
విశాఖపట్నానికి		
ఎయిరిండియా	10.55	బుధవారం మినహా
ఎయిరిండియా	15.35	బుధవారం మాత్రమే
వారణాసి(కాశీ)కి		
స్పైస్‌జెట్	14.40	మంగళవారం మినహా



స్వాగతం పలుకుతున్న పుట్టగుంట సతీష్

తెలుగు ప్రేక్షకులు ఆదరించారు

సినీనటి కామ్నాజఠ్మలాని

ప్రజాశక్తి-ఉంగుటూరు(హనుమాన్‌జంక్షన్)

తెలుగు ప్రేక్షకులు నన్నెంతగానో ఆదరించారని వారంటే నాకెంతో ఇష్టమని సినీ హీరోయిన్ కామ్నాజఠ్మలానీ అన్నారు.పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఓ ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొనటానికి గన్నవరం విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో వెళ్తూ హనుమాన్‌జంక్షన్‌లోని పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ కార్యాలయంలో కొద్దిసేపు ఆగి వెళ్లారు.ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ తాను తెలుగులో 15 చిత్రాల్లో కథానాయికగా నటించాన న్నారు.ఓకొత్త బ్యానర్‌పై శ్రీకాంత్ హీరోగా తాను హీరో యిన్‌గా తెలుగులో రెండేళ్ల తరువాత నటించబో తున్నట్లు పేర్కొంది.అనంతరం బొమ్ములూరులోని పుట్టగుంట సతీష్‌కుమార్‌కు చెందిన తోలుపరిశ్రమను సందర్శించి అక్కడ నుంచి భీమవరం బయలుదేరి వెళ్ళారు.ఈకార్యక్రమంలో పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్,టిడిపి మండల అధ్యక్షులు వీరమాచినేని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కైకలూరు కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపి మాగంటి బాబు

కైకలూరు : ప్రజలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు మెరుగైన సేవలు అందించినప్పుడే పార్టీ మనుగడ ఉంటుందని ఎంపి మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) అన్నారు. మండలంలోని ఆటపాకలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీడీపీ నియోజకవర్గ నూతన కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలమైన నియోజకవర్గ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమని అందుకు జమమంగళలను అభినందించారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ సమస్య తలెత్తిన పార్టీ కార్యాలయానికి తెలియజేసి పరిష్కారం దిశగా నాయకులు, కార్యకర్తలు శ్రమించాలన్నారు. పార్టీ విజయవంతంగా ఉంటేనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతామని, ప్రజలకు సేవలు అందిస్తేనే పార్టీపై నమ్మకం ఉంటుందని ప్రజలు నమ్ముకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన నాయకులకు, కార్యకర్తలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలిదిండి ఎఎంసి ఛైర్మన్ ఛైర్మన్ వల్లబనేని శ్రీనివాసచౌదరి, జడ్పిటిసి నున్న రమాదేవి, కైకలూరు, మండవల్లి, కలిందిడి, మండలాధ్యక్షులు పెన్మెత్స త్రినాథ్‌రాజ్, తలారి వెంటకస్వామి, పోకల జోగిరాజు, టిడిపి నాయకులు చిట్టూరి రవీంద్ర, కొల్లేరు సంఘాల ప్రధాన కార్యదర్శి బలే ఏసురాజు, సయ్యపురాజు గుర్రాజు.తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పటాపంచల జమలయ్య

ప్రజాశక్తి - ఎ.కొండూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని విస్మరించి, రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడితే గుణపాఠం తప్పదని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పటాపంచల జమలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని కోడూరు, కంభంపాడు, ఎ.కొండూరు తండా, చీమలపాడు గ్రామాలలో రైతుసంఘం ఆధ్వర్యంలో నిర్వ హించిన రైతుయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంపలగూడెం మండలం, పెనుగొలను రైతులు నకిలీ మిర్చినారు వల్ల నష్టపోతే పరిహారం ఇవ్వాలని వ్యవసాయశాఖ కమీషనర్, కలెక్టర్ ఆదేశాల్చి సంవత్సరం అవుతున్నా నేటికి నర్సరీ యజమానులు పరిహారం ఇవ్వలేదన్నారు. ఆగ్రామంలో 87 మంది రైతులు 161 ఎకరాలలో మిర్చి పంట సాగుచేయగా నకిలీ నారు కావ డంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చిన నివేదికల ఆధారంగా జిల్లా కలెక్టర్ ఎకరానికి రూ.91 వేలు నష్టపరిహారం చెల్లించాలని నర్సరీ యజమానులను ఆదేశించినా వాటిని ఇవ్వనీయకుండా అధికార పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఎ.కొండూరు మండంలో కూడా నకిలీ మిరప నారుతో గిరిజన రైతులు కూడా ఈయేడాది నష్టపోయారని, వారికి కూడా ప్రభు త్వం పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తానని, రైతుల రుణాలను పూర్తిగా మాఫీచేస్తానని వాగ్దానంచేసి అధి కారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమాన్ని విస్మరించారని తెలిపారు. రాష్ట్రంలో రూ. 88 వేల కోట్లు రు ణాలను మాఫీ చేయాల్సివుండగా రూ.11వేల కోట్లకు మాత్రమే మాఫీ జరిగిందన్నారు. ప్రభుత్వం అను చరిస్తున్న విధానాలవల్ల వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో కూరుకు పోయిందన్నారు. వ్యవసాయం చేయాలంటే రైతులు బయపడుతున్నారన్నారు. గిట్టుబాటు ధర కోసం రైతులు అనేక రాష్ట్రాలలో రోడ్లెక్కి ఆందోళణ చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదని రైతులు కన్నెరచేస్తే ప్రభుత్వాలు కూలిపోతాయని జమలయ్య హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం పశ్చిమకృష్ణా కార్యదర్శి పగ డాల వీరాంజనేయులు, కౌలు రైతుసంఘం పశ్చిమకృష్ణా అధ్యక్ష, కార్యదర్శులు గువ్వల సీతారామిరెడ్డి, నిమ్మగడ్డ నరసింహా, రైతుసంఘం తిరువూరు మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు, రైతుసంఘం నాయకులు ఆళ్ల అమ్మిరెడ్డి, యోహాన్, కావూరి రాములు, ప్రజాసంఘాల నాయకులు గోపిరాజు, జెట్టి వెంకటేశ్వరరావు, రాముడు, గోపి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గువ్వల సీతారామిరెడ్డి

తోటివారికి సేవకు తృప్తి



చీరెలు పంపిణీ చేస్తున్న కిరణ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సమాజంలో వృద్ధులకు, బడుగు వర్గాల వారికి సేవచేయడంలో ఉన్నంత తృప్తి మరోటి లేదని బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి బి.కిరణ్ అన్నారు. బాడవపేట 4వ లైనులో గొర్తి సత్యవతి ఛారిటబుల్ ట్రస్ట్, విక్రాంత్ పబ్లిషర్స్ ఆధ్వర్యంలో వృద్ధులకు పేదవారికి చీరెల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కిరణ్ మాట్లాడుతూ క్రీస్తు పుట్టిన రోజు కానుకగా చీరెలు పంపిణీచేయడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. వృద్ధులకు సేవచేస్తున్నట్లే పేద విద్యార్ధులకు కార్పొరేట్ సంస్థలు ఉపకార వేతనాలు ఇచ్చి వారి అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. విక్రాంత్ పబ్లిషర్స్ అధినేత గొర్తి శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ గొర్తి సత్యవతి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏడాది వృద్ధులకు, వితంతువులకు, పేదలకు ఉచితంగా 200 మందికి చీరెలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తమట్రస్ట్‌తో పాటు బాడవపేట పెద్దలు సహాయ సహకారాలు అందిస్తూ పేదలకు సేవలందించడం ముదుస్వభావం అన్నారు. సమాజంలో ఎంతో మంది ధనవంతులు ఉన్నారని వారిలో 50 శాతం మంది నిరుపేదల కోసం ట్రస్ట్‌లు స్థాపించి ఆదుకుంటే కొంతవరకు అయిన ప్రభుత్వం చేసే అభివృద్ధిలో పాలుపంచుకున్న వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్పొరేటర్ ఆతుకూరి రవి కుమార్, టి.రామి శంకర్, వి.మోహన్, జె.రాజా, బాడవ పేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - గవర్నరుపేట

సమాజానికి కావలసిన విద్య, వైద్య ఆరోగ్యపరంగా సేవలందించేందుకే వేసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆవిర్భవించిందని వాసవి క్లబ్ ఇంటర్ నేషనల్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షులు పబ్బా విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఒక ప్రముఖ హోటల్లో వాసవిక్లబ్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగిగంది. ఈ సందర్భంగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. 1960లో ప్రారంభమైన వాసవిక్లబ్ గతంలో జిల్లాలుగా విడగొట్టబడి ఇప్పుడు 27వ జిల్లా కలిసిందని తెలిపారు. జిల్లా గవర్నర్ మామిడి శ్రీనివాసరావు అధ్యక్షతన నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. జిల్లా క్యాబినెట్ సెక్రటరీగా తతరజనికుమార్, కొనకళ్ల సత్య కృష్ణప్రసాద్,, మజూటి రామచంద్రరావు, జిల్లా కోశాధికారి అన్నం సాయిసునిత ఎంపికయ్యారు.



మాట్లాడుతున్న విజయ్‌కుమార్


త్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం అవమానకరం

ప్రజాశక్తి - సత్యనారాయణపురం

ముస్లిం సమాజానికి ఎంతో కీలకమైన తలాక్ బిల్లును పార్లమెంట్‌లో మూజువాణి ఓటుతో ఆమోదింపజేయటం దేశ పార్లమెంట్ వ్యవస్థకు అవమానకరంగా ముస్లిములు భావిస్తున్నారని ముస్లిం ఐక్యవేదిక అంజుమన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్.జలీల్ అన్నారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ తలాక్ బిల్లు అమల్లోకి వస్తేముస్లిం కుటుంబాల్లో అశాంతి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత లోపించిందన్నారు. కొన్ని మత ఛాందసవాదులకు మత శక్తులకు అనుకూలంగా కేంద్రం పని చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో కూడా ముస్లింలకు రక్షణ కరువైందన్నారు. ముస్లిం పవిత్ర గ్రంథం ఖురాన్‌ను గతలబెట్టటం, రాజమహేంద్రవరంలో మౌజన్‌ను హత్య చేయటం వంటి సంఘటనలు రాష్ట్రంలో ముస్లింల రక్షణపై రాష్ట్రప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏ మాత్రం లేదని స్పష్టమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహార శైలికి నిరసనగా జనవరి 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు. ఈ సమావేశంలో సంస్థ గౌరవాధ్యక్షుడు అహ్మద్ భాషా, జాతీయ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, నగర అధ్యక్షుడు అమానుల్లా ఖాన్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు షాజీ, కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ ఛైర్మన్ ఎస్.డి.కరిముల్లా పాల్గొన్నారు.

జన్మభూమి సభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జి.కొండూరు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు)

ప్రభుత్వం జనవరి రెండు నుండి చేపట్టిన జన్మభూమి మహోత్సవాలను జయప్రదం చేయాలని మండల టిడిపి ప్రధాన క్యారదర్శి కొల్లి నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో ప్రజల అవసరాలను, అభ్యర్ధనలను గుర్తించిన ప్రభుత్వం జన్మభూమి గ్రామ సభలు ద్వారా వారి సమ స్యలను తక్షణమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. పేదరికంలో బాధలుపడుతున్న ఆర్తులను ఆదుకోవడ మే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మభూమి గ్రామసభల ద్వారా అధికారులను, ప్రజాప్రతినిధుల ను ప్రజల వద్దకు తీసుకురావడం జరుగుతుందన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులతో పాటు జన్మభూమి కమిటీలు, ప్రజా ప్రతిని ధులు, పార్టీ నాయకులు, కలిసి ఒక ఉత్సవంలా జన్మభూమిని జరపబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిఒక్కరు సేవాభావంతో ముందుకొచ్చి 11వ తేదీ వరకు జరగనున్న జన్మభూమి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పల్లెప్రగతికి పంచదార పరిశ్రమలే పట్టుకొమ్మలు

ప్రజాశక్తి - మొవ్వ

గ్రామీణ ప్రాంతంలో రైతన్నలకు నికర ఆదాయాన్నిచ్చే చెరకు పంట నుంచి చక్కెర తయారుచేసే పంచదార పరిశ్రమలే పల్లెప్రగతికి పట్టుకొమ్మలని లక్ష్మిపురం కెసిపి డిజిఎం మండవ రామ్మోహనరావు పేర్కొన్నారు. మొవ్వ ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మిగిలిన పంటల మాదిరిగా వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలతో సంబంధం లేకుండా నికర ఆదాయానిచ్చే చెరకుసాగుపై రైతులు అధిక సంఖ్యలో ఆసక్తిచూపుతున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని చెరకు కర్మాగారాలకంటే లక్ష్మిపురం కర్మాగారం ఆదాయంతో సంబంధం లేకుండా రైతు శ్రేయస్సుకు విశేష కృషిచేస్తుందని, దీంతో ఎన్నో అవార్డులు అందుకుందన్నారు. కార్మిక రక్షణ, నాణ్యతాప్రమాణాలు సాధించటంతోపాటు సమాజసేవలో పలు అభివృద్ధి పనులకు సహకరిస్తుందన్నారు. మన ప్రాంత చెరకుతోపాటు డెల్టా షుగర్స్ కింద ఉన్న పంటతో కలిపి 1.75లక్షల టన్నులు గానుగ ఆడనున్నట్లు తెలిపారు. విత్తనం వేసిన దగ్గర నుంచి రైతులకు కావల్సిన అన్ని యాజమాన్య పద్ధతులను, సాంకేతిక సలహాలను అందిస్తూ నిత్యం రైతులతో మమేకమై ప్రోత్సహిస్తుందన్నారు. వీరితోపాటు కంపెనీ ఎడ్వయిజర్ వెంకటేశ్వరరావు, క్షేత్రపరిశీలకులు వేణు, శ్రీనివాస్, రవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామ్మోనరావు

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయవాడ
సోమవారం 1 జనవరి 2018

2017కు వీడ్కోలు...2018కు స్వాగతం పలుకుతూ.....

నగరంలో సందడి

కేక్‌లు, ఫ్లవర్‌బొకే, స్వీట్స్ షాపుల వద్ద పెరిగిన రద్దీ
పెరిగిన ధరలు... సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు...


పివిపి మాల్‌లో అలంకరణ

ప్రజాశక్తి - విజయవాడ

నగర వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకల సందడి నెలకొంది. 2017కు వీడ్కోలు పలుకుతూ 2018కు స్వాగతం పలుకుతూ నగరంలోని యువతీయువకులు, విద్యార్థులు, ఆయా తరగతుల ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకుంటున్నారు. నూతన సంవత్సర వేడుకలకు స్వీట్స్, కేక్‌లు, పండ్లు, ఫ్లవర్‌బొకేలు, పూలు, కుంకమ, వస్త్రదుకాణాల్లో సందడి నెలకొని, వాటికి విపరీతమైన గిరాకీ పెరిగింది. నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే సంస్కృతి ఇటీవల కాలంలో వాడవాడలా పెరిగిపోయింది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ శుభాకాంక్షలు తెలుపుతూ నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని శుభాశీస్సులు చెప్పడం, మరలా తిరిగి తీసుకోవడం నగరంలో సందడి నెలకొంది. ప్రతి ఒక్కరూ వేలాది రూపాయలు ఖర్చు చేయడానికి సైతం వెనుకాడటం లేదు. గతంలో ఉండే గ్రీటింగ్స్ పంపించే సంస్కృతి తగ్గిపోయి, పెరిగిన సెల్‌ఫోన్ సంస్కృతిలో సెల్‌ఫోన్, ఎస్‌ఎంఎస్‌లు, వాట్స్‌ప్, ఇన్‌స్టోగ్రామ, టెలిగ్రామ్ తదితర వనరులతో ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షంలు తెలుపుతూ హుషారెత్తిస్తున్నారు. చిన్నలు దగ్గర నుంచి పెద్దలు ప్రతి ఒక్కరూ విషెస్ తెలుపుతూ, వారి వారి మధ్య ఉన్న అవినాభావ సంబంధాలను గుర్తు చేసుకునే పనిలో బిజీ అయ్యారు. జిల్లా కలెక్టర్ వద్ద నుంచి ఒక స్థాయి అధికారి వరకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి దిగువ స్థాయి అధికారులు, సిబ్బంది సిద్ధమవుతున్నారు. ఇటీవల నూతనంగా నగరంలో ఏర్పాటయిన పివిపి మాల్స్ దగ్గర నుంచి ట్రెండ్‌సిటీ మాల్ లాంటి పెద్ద పెద్ద షోరూమ్స్, స్వగృహపుడ్స్, స్వీట్స్ షాపులు, ఫ్లవర్‌బొకేల షాపుల వద్ద రద్దీ పెరిగింది. పైన పేర్కొన్నట్లు కేక్‌లు, స్వీట్స్‌కు, పండ్లు, పూలు, ఫ్లవర్‌బొకేలు, ఇలా ప్రతి ఒక్కటీ గిరాకీ పెరిగింది. కేజి కేక్ రూ.220 నుంచి 240 వరకు ధర పలుకుతుంది. ఇళ్ల ముంగిట రకరకాల కలర్స్‌తో నూతన సంవత్సరానికి శుభాకాంక్షలు తెలుపుతూ అందమైన ముగ్గులు పోటీ పడినట్లు తీర్చిదిద్దారు. వన్‌టౌన్‌లోని దుకాణాలు, సెంట్రల్‌లోని బీసెంట్ రోడ్డు, పటమట తదితర ప్రాంతాల్లో వివిధ రకాల వ్యాపారాల రద్దీ పెరిగిపోయింది. జిఎస్‌టి ప్రభావంతో పాటు మార్కెట్ గిరాకీతో ధరలు పెరిగాయి. నూతన సంవత్సర బంపర్ ఆఫర్స్ పేరుతో వ్యాపారులు పెద్ద ఎత్తున సొమ్ము చేసుకునే పనిలో బిజీ అయ్యారు. గత ఏడాది కన్నా ధరలు పెరిగినట్లు వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు. మధ్యతరగతి, ఆపై మధ్యతరగతి ప్రజలు పెరిగిన ధరలను పరిగణనలోకి తీసుకోకపోయినా, పేద, దిగువ మధ్య తరగతి ప్రజలకు పెరిగిన ధరలతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలంటే ఆలోచించక తప్పడం లేదు. కృష్ణలంక ఫీడర్ రోడ్డులో కూడా నూతన సంవత్సర వ్యాపారాల సందడి నెలకొన్నది. ప్రధానంగా 23వ డివిజన్‌లోని ఫీడర్ రోడ్డులో సత్యం హోటల్ వద్ద నుంచి నల్లగేటు సెంటర్ వరకు వ్యాపారాల సందడి నెలకొన్నది. కేక్‌లు, పండ్లు, ఇతర సరుకుల కొనుగోలు దారులతో సందడి నెలకొంది. ఫీడర్ రోడ్డులో రద్దీ పెరిగింది. రాకపోకలకు కూడా ఇబ్బంది పడక తప్పడం లేదు. రోడ్డుపైనే వ్యాపారాలు జోరుగా నడుస్తున్నాయి.


వెలుగులు జిమ్ముతున్న వస్త్ర దుకాణాలు


రంగుల కొనుగోలు చేస్తున్న ప్రజలు

గాంధీనగర్‌లో నూతన సంవత్సర వేడుకలు

గాంధీనగర్ : నగరంలోని గాంధీనగర్ ప్రాంతంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యాయి. లెనిన్ సెంటర్, అలంకార్ సెంటర్లు వినియోగదారులతో ఆ ప్రాంతం బిజీగా మారింది. లెనిన్ సెంటర్లోని చందన బ్రదర్స్‌లో వస్త్రాల కొనుగోలు కోసం జనం అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలంకార్ సెంటర్‌లోని స్వీట్ షాపులో ప్రత్యేక మిఠాయిలు అనేకం తయారు చేసి విక్రయిస్తున్నారు. కేకులు కూడా భారీగా తయారు చేశారు. చందన బ్రదర్స్, అలంకార్, ఐలాపురం, జగపతి ఇంటర్నేషనల్, సదరన్ గ్రాండ్ హోటల్లను విద్యుత్ దీపాలంకరణ చేశారు. శైలజ, అలంకార్, రాజ్, యువరాజ్, శాంతి, ప్రశాంతి, ఐనాక్స్, జయరాం తదితర సినిమా థియేటర్లను ప్రతేకంగా అలంకరించారు. ఈ వేడుకల్లో భాగంగా ఎన్‌ఆర్‌పి రోడ్‌లోని టిడిపి కార్యాలయంలో అర్బన్ ప్రతినిది నవనీతం సాంబశివరావు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి అందరికీ పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **(ప్ర.వి)**

వీరి బతుకులు బాగుపడవా..!

నూతన సంవత్సరాలు వస్తున్నాయ్, పాత సంవత్సరాలుగా గడిచిపోతున్నాయ్... కానీ పేదవాడి జీవితాల్లో వెలుగులు వచ్చేదెప్పుడు... బతుకులు బాగుపడేదెప్పుడు... జానెడు పొట్ట నిండేదెప్పుడు ఇదిగో ఈ చిత్రాన్ని చూడండి. పొట్ట కూటికోసం మురికి కూపాన్ని సైతం గాలిస్తూ... ప్లాస్టిక్ బాటిల్స్ ఏరుకుంటూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నాడు ఓ పేద యువకుడు...


భవానీపురం ప్రాంతంలోని డ్రెయినేజీలో చెత్త ఏరుకుంటున్న వ్యక్తి

ఫొటో : -వి.యు. పణికుమార్, భవానీపురం

విజయ బ్రిలియంట్స్ స్కూల్లో కలర్స్ డే


విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న తల్లిదండ్రులు



విజయవాడ : చిన్నపిల్లలు చదివిన దానికన్నా కంటితో చూసినదానినే బాగా గుర్తుపెట్టుకుంటారని లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ వైభవ్ మాస్టర్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు ఎ.సాయికృష్ణ అన్నారు. కృష్ణలంక, బాపనయ్య నగర్‌లో గల విజయ బ్రిలియంట్స్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కలర్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన పై విధంగా మాట్లాడారు. వెజిటేబుల్స్, ఫ్రూట్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అలాగే పరిసరాలను పచ్చగా ఉంచుకోవటం ద్వారా గాలి, నీరు కలుషితం కాకుండా ఉంటాయన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందన్నారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపల్ సిహెచ్.వెంగళరెడ్డి మాట్లాడుతూ చిన్నపిల్లలు కలర్స్‌ను వాటితో తయారు చేసిన వస్తువులను బాగా గుర్తుపెట్టుకుంటారన్నారు. అందుకే ఒక్కో కలర్‌కి ఒక్కో రూమ్ కేటాయించామన్నారు. గ్రీన్, వైట్ ఎల్లో, ఫారెస్ట్ వంటి రకరకాల ఐటమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ సంగమం కోశాధికారి పేరిరెడ్డి, మాజీ కోశాధికారి అయ్యప్ప, విద్యార్థుల తల్లిదండ్రులు, పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు.


చిన్నారుల సందడి

ప్రాధాన్యత పెరిగినా అభివృద్ధి లో దూరం...

ప్రజాశక్తి - విజయవాడ స్పోర్ట్స్

...గుతున్న నేపథ్యంలో (జిల్లా) నుండి అనేక మంది విద్యార్థులు ఈ సంవత్సరం రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ప్రాధాన్యత పెరిగినా అందుకు తగిన ఏర్పాట్లు, కసరత్తు విషయంలో వెనుకడే ఉన్నట్లు తెలుస్తోంది.

క్రీడా శాఖ పై పట్టు లేని క్రీడా మంత్రి

రాష్ట్ర యువజన సర్వీసులు - క్రీడా శాఖ మంత్రిగా కొల్లు రవీంద్ర బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటి వరకు కొల్లు రవీంద్రకు క్రీడా శాఖపై పట్టు లేదన్నది వాస్తవం. దీంతో ఆయన పూర్తిగా క్రీడా వ్యవస్థపై అవగాహన లేని విధంగా వ్యవహరిస్తున్న తీరు సైతం అందరిని కలవరపెడుతుంది. పైగా ఆయన పలు సందర్భాల్లో క్రీడలకు సంబంధం లేని వ్యాఖలు చేయడం కూడా హాస్యాస్పదంగా మారింది. ఈ మధ్య కాలంలో టిడిపి ఎంఎల్ఎలు పలు సందర్భాల్లో అవగాహన లేని విధంగా ప్రవర్తించడం, విజయవాడ తూర్పు ఎంఎల్ఎ జలీల్‌ఖాన్ కాంలో ఫిజిక్స్ చదివానని, చెప్పడం టిడిపి ప్రతినిధులకు అవగాహనా రాహిత్యాన్ని ప్రదర్శిస్తుంది. ఇదే కోణంలో ఏప్రిల్‌లో జరిగిన బేస్ బాల్ క్యాంప్ ప్రారంభంలో పి.వి.సింధూను బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అని పలకడానికి బదులు బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అని సంబోధించడం కూడా మంత్రికి ఏ మేర క్రీడలపై అవగాహన ఉందో తెలియజేస్తుందని పలువురు బహిరంగంగానే విమర్శలు గుప్పించారు.

శాప్ పాలకమండలి కాలం అనంతరం నూతన కమిటి లేని వైనం

శాప్ పాలకమండలి కాలం పూర్తయిన తరువాత నేటి వరకు నూతన పాలకమండలిని ఏర్పాటు చేయలేదు. దీంతో పాలనాపరమైన నిర్ణయాలు, ప్రజాభిప్రాయం లేని అభిప్రాయాలనే అధికంగా తీసుకుంటున్నారని క్రీడా అధికారులపై విమర్శలు గుప్పుమన్నాయి. అందుకు అనుగుణంగా అధికారులదే పూర్తి బాధ్యతగా పేర్కొంటూ ప్రభుత్వం కూడా జీ.వోను విడుదల చేయడం కూడా కొంత మేర క్రీడాఅభివృద్ధికి అడ్డంకి ఏర్పడిందనే చెప్పాలి. ఈ కోణంలో మాజీ చైర్మన్ పి.ఆర్.మోహన్‌ను తిరిగి చైర్మన్‌గా ఏర్పాటు చేయాలని చంద్రబాబు అనుకున్నా నేటి క్రీడా రాజకీయాల వలన సిఎం ఆ సాహసం చేయలేదనే వాదన బలంగా వినిపించింది. దీంతో బాధ్యత మొత్తం అధికారులకే ప్రభుత్వం కట్టబెట్టింది. శాప్‌కు పాలకమండలి లేకపోవడంతో అధికారుల ఇష్టారాజ్యంగా మారిందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

అమరావతి ప్రాంతంలో క్రీడా అభివృద్ధికి శంకుస్థాపనలు

ఆంధ్ర రాజధానిగా విజయవాడ (అమరావతి ప్రాంతం) ఏర్పడటంతో అమరావతి ప్రాంతంలో పలు క్రీడాభివృద్ధికి కార్యక్రమాలకు శంకుస్థాపనలు జరిగాయి. అమరావతిలో క్రీడా కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో క్రీడా మైదానాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ప్రకటించి జీవోను విడుదల చేశారు. రాజధాని ప్రాంతంలోని అన్ని నియోజకవర్గాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసే పనిలో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. ప్రతి పాఠశాల్లో తప్పనిసరిగా క్రీడలను ఎర్పాటు చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇలా రాజధాని ప్రాంతానికి క్రీడా అభివృద్ధిలో అధిక శాతం ప్రాధాన్యతను కల్పించారు. అయితే ఇవన్ని నిర్మాణ దశలోనే ఉండటం గమనార్హం.

అధికారులదే పాలన : అంతా గోప్యం

పాలకమండలి పదవి కాలం అనంతరం తిరిగి కమిటీని ఏర్పాటు చేయకపోవడంతో క్రీడా అధికారుల పాలన అంతా గోప్యంగా సాగుతుందనే విమర్శలు వచ్చాయి. అందుకు అనుగుణంగానే కొంత మంది అధికారులు కొన్ని మైదానాలలో అన్ని వసతులు ఉన్నట్టు చూపించి భారిగా డబ్బులు దండుకున్నారని గత ఆరు నెలల క్రితం స్వయంగా మాజీ శాప్ చైర్మన్ పి.ఆర్.మోహన్ చంద్రబాబు ముందు బహిరంగంగానే విమర్శలు చేశారు. దీంతో ఒక్క సారిగా క్రీడా లోకం ఉలిక్కిపడింది. అయితే సి.ఎం.దీనిని లైట్ తీసుకోవడంతో సరైన విచారణ జరగలేదు. ఇందుకు నిదర్శనం అప్పటి మాజీ కృష్ణా జిల్లా డిఎస్‌డివో, ప్రస్తుత శాప్ ఒఎస్‌డి పి.రామకృష్ణ హయాంలో ఈడ్పుగల్లులో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్ ఉదాహరణ అని చైర్మన్ పి.ఆర్.మోహన్ పేర్కొన్నారు.

2017వ సంవత్సరంలో మొత్తం 8 నెలలు ప్రభుత్వమే క్రీడాధికారం చేపట్టి పాలన చేసింది. ఉరుకులు - పరుగుల జీవితంలో క్రీడలు మనిషిలో భాగమైపోయాయి. నేటి ఆధునిక యుగంలో ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా క్రీడలు అవసరం. అటువంటి క్రీడాశాఖ 2017లో చేసిన పనులు-సాధించిన విజయాల సంఖ్య చూసుకుంటుంటే క్రీడా అభివృద్ధి 10 శాతం ఉంటే 10 శాతంలో కూడా పనులు ఇంకా నిర్మాణదశలో ఉన్నాయి. మిగిలిన 90శాతం మాత్రం రాజకీయాలు, సంఘాల కొట్లాట, రాష్ట్రంలో ప్రతి క్రీడకు రెండేసి సంఘాలు, ప్రతి జిల్లా కేంద్రానికి రెండేసి సంఘాలు పుష్కలంగా దర్శనమిస్తున్నాయి. కాని మండల స్థాయి, సంఘాలు మాత్రం లేవు. క్రీడల అభివృద్ధిలో క్రీడాసంఘాలదే ప్రధాన పాత్ర. అటువంటి క్రీడా సంఘాలు మాత్రం టిడిపి హయాంలో యథేచ్ఛగా కొట్లాడుకుంటున్నాయి. కానీ టిడిపి ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తున్నట్టు చూస్తుండటం క్రీడా కారులను 2017లో నిరూత్సాహంగా ఉన్నారు.

క్రీడా శాఖ పై పట్టు లేని క్రీడా మంత్రి

శాప్ పాలకమండలి రద్దు-నూతన కమిటీ లేని వైనం

అధికారులదే పాలన, అంతా సిక్రేట్

అమరావతి ప్రాంతంలో క్రీడా అభివృద్ధికి శంకుస్థాపనలు

2017-22 క్రీడా పాలసీపై చర్చ ఏదీ

బహిరంగంగానే ఒ.ఎస్.డి తీరును ఆయన తప్పుబట్టారు. ఇదే తరుణంలో క్రీడల్లో రాజకీయాలు జాతీయ స్థాయిని మించిపోయాయి. స్వయంగా క్రీడల్లో టిడిపి నేతలు ఎవరూ జోక్యం చేసుకోవద్దని సిఎం చంద్రబాబు టిడిపి నేతలను హెచ్చరించారు. దీంతో నేటికి క్రీడల్లో రెండు గ్రూపులు కొనసాగుతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం టిడిపిలో ఉన్న రెండు గ్రూపుల్లో గల్లా జయదేవ్ వర్గానికి గుర్తింపు ఇస్తూ సిఎం అధికారికంగా ప్రకటన విడుదల చేయడంతో సిఎం.రమేష్ వర్గం కోర్టును ఆశ్రయించారు. అయితే గల్లా జయదేవ్‌కు చెందిన కంపెనీల్లో ఐఒఎ (ఇండియన్ ఒలింపిక్స్ సంఘం)కు చెందిన రామచంద్రన్ కుమారుడు ఉద్యోగం చేస్తున్నారని ఈ కోణంలో భారీగా ముడుపులు చేతులు మారాయని కోర్టును సి.ఎం.రమేష్ వర్గం ఆశ్రయించడం, కోర్టు ఆరిబ్రిటేషన్ కమిటీని వేయడం, దీనికి తోడు గత నెలలో జరిగిన ఐఒఎ ఎన్నికల్లో రామచంద్రన్ తప్పుకోవడం గల్లా జయదేవ్ వర్గానికి గుర్తింపు రద్దు చేసి, సి.ఎం.రమేష్ వర్గానికి గుర్తింపును కేటాయించడంతో రాష్ట్ర టిడిపి సైతం సైలెంట్‌గా ఉన్నారు. దీంతో మరలా అధికారం చేతులు మారడం, తిరిగి గల్లా జయదేవ్ వర్గం కోర్టును ఆశ్రయించడంతో కథ మొదటికి వచ్చింది. ఇలా టిడిపిలోని రెండు వర్గాలు కుమ్ములాటలకు పాల్పడటంతో క్రీడా అభివృద్ధి కుంటుపడిందని క్రీడాకారులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సిఎం సైతం క్రీడలలో అభివృద్ధిని ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. రాబోవు 2018 సంవత్సరంలో అయినా క్రీడలు అభివృద్ధి చెందాలని క్రీడాకారులు ఆశ పడుతున్నారు. సరైన పాలన లేకపోవడంతో అధికారులు అడిందే ఆట-పాడిందే పాటగా క్రీడా పాలన కొనసాగుతుంది. అందులోను ముఖ్యంగా శాప్ ఒఎస్‌డి గల్లా జయదేవ్ వర్గానికి కొమ్ముకాస్తున్నారని, 30 లక్షలను దొడ్డి దారిన దుర్వినియోగం చేశారని రెజ్లింగ్ సంఘం ఆరోపిస్తుండటం, అందుకు సంబంధించిన ఆధారాలతో సైతం మీడియా ముందుకు రావడంతో అధికారులు పాలన అంతటా డబ్బు మయంగా కొనసాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే శాప్ ఒఎస్‌డి రామకృష్ణ పై చర్యలు తీసుకుంటామని శాప్ ఎమ్‌డి తమకు హామీ ఇచ్చారని రెజ్లింగ్ సంఘం పేర్కొంది. దీంతో సరైన క్రీడా పాలకమండలి లేకపోవడంతో అధికారుల దనదాహం పెరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు.

2017-22 క్రీడా ఫాలసీ పై చర్చ ఏది


కబడ్డీ పోటీలు (ఫైల్)

2017-22 క్రీడా పాలసీని రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి అనుగుణంగా క్రీడా పాలసీని ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. అయితే ఈ పాలసీలో క్రీడాకారులకు స్కాలర్ షిప్‌లు, ఆర్థిక సహాయాలు, క్రీడా సౌకర్యాల కల్పన, క్రీడలకు రిజర్వేషన్ ఏర్పాటు చేయడం ఇలా తదితర అంశాలను క్రీడా పాలసీలో పొందు పరిచినా మొత్తం అధికారులు ఏకపక్షంగా ఈ పాలసీని ఆమోదించారని, క్రీడా సంఘాల నుండి సరైన అభిప్రాయాలను తీసుకోలేదని వాదన బలంగా వినిపించింది. అయితే దీనిపై సమగ్రమైన చర్చ జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన క్రీడా పాలసీని తీసుకురావాలని పలువురు క్రీడా ప్రతినిధులు పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో క్రీడా అభివృద్ధి మరుగున పడుతుందని పలువురు క్రీడా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మూలపాడులో క్రికెట్ పోటీలు (ఫైల్)

అధికారులకు నచ్చిన వారికి అన్నీ ఆమోదం

ఈ మధ్య కాలంలో, అందులోను 2017 సంవత్సరం మొత్తం చూస్తే అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు మాత్రమే రాష్ట్రంలో బాగా జరిగాయి. అయితే క్రికెట్ మాత్రం ఎసిఎ, బిసిసిఐ స్వయంగా పరిశీలిస్తుండగా, రాష్ట్రంలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ క్రీడా సంఘాలకు మాత్రం శాప్ అధికారులు అన్నీ సమకూర్చారు. వారు అడిగిన నిధులను కూడా ఎటువంటి అనుమానాలు లేకుండా విడుదల చేశారు. అందు లోను ఇష్టానుసారంగా టోర్నీలను కూడా నిర్వహించేశారు. దీంతో మిగిలిన క్రీడా సంఘాలు క్రీడల నిర్వా హణకు సిద్ధ మైన వీరికి లేని సహాయం ఆ రెండు క్రీడలకే ఎందుకనే సందే హాన్ని అందరూ వ్యక్తం చేస్తు న్నారు. దీంతో అధికారులు అన్ని క్రీడలను ప్రోత్సహించాలని వారు కోరుతున్నారు. ఇలా 2017లో క్రీడా లోకం అంతటా 10 శాతం అభివృద్ధి, మిగిలిన 90 శాతం రాజకీయాలు, గొడవలు, కొట్లాటలు, కోర్టు కేసులు ఇలా గడిచాయి. 2018 సంవత్సరం అయినా క్రీడాశాఖ అభివృద్ధిలో ముందుంటుందని క్రీడాకారులు భావిస్తున్నారు.

ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు దుర్గమ్మను దర్శించుకున్నారు. నగరంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు విజయవాడ వచ్చిన ఆయన ఆదివారం దుర్గగుడికి విచ్చేశారు. ఆలయ అధికారులు ఆయనకు సాధర స్వాగతం పలికారు.

ట్రాఫిక్ కోరల్లో సొరంగ మార్గం

ఫ్లైఓవర్ నిర్మాణంతో పెరిగిన రద్దీ

కొండపై ప్రమాదభరితంగా చెట్లు

జారిపడుతున్న బండ రాళ్లు

ప్రజాశక్తి - భవానీపురం

ఒకప్పుడు రోడ్డు మార్గం లేనిరోజుల్లో నగరానికి చెందిన ప్రముఖ ఇంజినీర్ కె.ఎల్.రావు పుణ్యమాని కొండను తొలిచి రోడ్డుగా తీర్చిదిద్దారు. నేడు ఆ దారే రహదారి. దుర్గా ఫ్లైఓవర్ నిర్మాణంతో సొరంగం మార్గం ట్రాఫిక్ కోరల్లో చిక్కుకుంది. ఇటు గొల్లపూడి నుండి వచ్చే వాహనాలు సితార జంక్షన్ నుంచి సొరంగంలోకి వెళ్లే మార్గం కొండ ప్రాంతం కావటం, రెండువైపులా ఏపుగా పెరిగిన చెట్లు దర్శనమిస్తున్నాయి. ఆ చెట్లు ఏ మాత్రం కూలినా అటుగా ప్రయాణించేవారి మీద పడటం ఖాయం. కొండపై అంత పెద్ద పెద్ద చెట్లు పెరిగినా తొలగించే పనులు చేయకుండా చోద్యం చూస్తున్నారని నగరపాలక సంస్థ అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు....

విద్యాధరపురం సొరంగ మార్గంలో రెండు వైపులా చెట్లు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తోంది. చెట్లుగా పెద్దవి కావడంతో అవి ఎక్కడ కూలుతాయోనని వాహనదారులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. విద్యాధరపురం, రామరాజ్యనగర్ ప్రాంతాలలో ఎక్కువ శాతం ప్రజలు కొండలపై నివాసముంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే కొండ ప్రాంత ప్రజలు బిక్కు బిక్కుమంటూ కాలం గడపాల్సిందే. అయితే చాలా మంది ప్రజలు గట్టు వెనుక ప్రాంతంలోని సొరంగం నుండి ప్రయాణిస్తుంటారు. దీనికితోడు ఆర్టీసి సిటీ బస్సులు, స్కూల్ బస్సులు, ఇంజినీరింగ్ కాలేజి వాహనాలు తిరుగుతుంటాయి. ముఖ్యంగా పనుల కోసం వెళ్లేవారు సర్వీసు ఆటోలలో వెళుతుంటారు. అయితే గత రెండేళ్లుగా దుర్గా ఫ్లైఓవర్ నిర్మాణ నేపథ్యంలో గొల్లపూడి బైపాస్ నుండి వచ్చే టూవీలర్స్ సొరంగం లోపల నుండి చిట్టినగర్ మీదుగా నగరంలోకి వెళ్ళాల్సి ఉంది. ఆర్టీసీ బస్సులు, లారీలు, ఆటోలు సితార జంక్షన్, కబేళా, చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ మీదుగా తిరిగి వన్‌టౌన్ నుంచి నగరానికి చేరుకోవాల్సి ఉంది. అలాగే నగరం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు (హైదరాబాద్), ఇతర వాహనాలు అన్ని చిట్టినగర్, సొరంగం మీదుగా బైపాస్ రోడ్డులోకి చేరుకుంటాయి. దీంతో సొరంగంలోకి ప్రవేశించే మార్గం కొండ ప్రాంతం రెండువైపులా పెద్ద పెద్ద చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో అవి ఏ క్షణాన ఏ చెట్టు, ఏ రాయి ఎవరిమీద పడతాయో తెలియని పరిస్థితి. నగరపాలక సంస్థ అధికారులు అటుగుండా ప్రయాణిస్తుంటారు తప్పించి వీటిపై దృష్టి సారించిన దాఖలాలు లేవు.

ట్రాఫిక్ కోరల్లో సొరంగం : సొరంగ మార్గం ట్రాఫిక్ కోరల్లో చిక్కుకుంటోంది. ఎవరూ వెళ్ళాలన్నా సొరంగ మార్గాన్ని ఆశ్రయిస్తున్నారు. సొరంగానికి రెండు వైపులా చెట్లు పెరిగిపోయి కనిపిస్తున్నాయి. ఇక వర్షాకాలంలో కొండ పైనుండి బండరాళ్లు కిందకు దొర్లుతూ పడతాయి. పైగా ఏపుగా పెరిగిన పెద్ద చెట్లు వల్ల వర్షాకాలం మరింత ప్రమాదాలు జరిగే ఆస్కారముంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టి యుద్ధప్రాతిపదికన పెరిగిన చెట్లను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


సొరంగం మార్గంలో ట్రాఫిక్


కొండపై పెరిగిన చెట్లు


మాట్లాడుతున్న కార్పొరేటర్ ఆదిలక్ష్మీ

చెత్త సేకరణ బుట్టలు పంపిణీ

ప్రజాశక్తి -వన్‌టౌన్

37వ డివిజన్‌లో ఆదివారం ఉదయం స్థానిక కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మీతో కలిసి మున్సిపల్ కార్పొరేషన్ ఏసిజి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మీ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బందితో పాటు ప్రజలకు కూడా తడి, పొడి చెత్తపై అవగాహన ఉండాలన్నారు. డివిజన్‌లో ప్రతి ఒక్కరికి వారి ఇంటికి తడి, పొటి చెత్తకు సంబంధించిన చెత్త బుట్టలను పంపిణీ చేశామని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఏసిజి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ సందర్భంగా చెత్త బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ అధికారి కృష్ణ, ఇతర మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న పోతిన మహేష్

ఇళ్లపట్టాల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -వన్‌టౌన్

వన్‌టౌన్‌లోని యేళ్ళ తరబడి ఉన్న ఇళ్ళ పట్టాల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళలు జనసేన రాష్ట్ర కార్యకర్త పోతిన మహేష్‌ను ఆదివారం పార్టీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా డ్వాక్రా రుణమాఫీ, పింఛన్, ఇళ్ళ పట్టాల సమస్య, డివిజన్‌లో ఉన్న సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా పోతిన మహేష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజలంతా సంతోషంగా జీవించాలి

రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ ఖాజా

ప్రజాశక్తి - భవానీపురం

నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ ఖాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక భవానీపురంకు చెందిన షేక్ ఖాజా పేదలకు సేవలందిస్తూ ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. 2017 సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ 2018లోకి అడుగిడుతున్న సందర్భంగా రాష్ట్రంలోని ముస్లీం, మైనార్టీలకు, తెలుగు ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కులమతాలకతీతంగా అందరూ కలిసిమెలిసి, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు.

ఆలయంలో అర్ధరాత్రి పూజలపై విచారణ

ప్రజాశక్తి -ఇంద్రకీలాద్రి

గత నాలుగు రోజుల కిందట దుర్గమ్మ ఆలయంలో అర్ధరాత్రి సమయంలో పూజలు నిర్వహించారని సమాచారం బయటకు రావడం, ఈ ఘటనను అన్ని పత్రికలు ప్రచురించడంతో ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. పాలకవర్గం కూడా ఈ ఘటనను సీరియస్‌గా పరిగణించింది. ఆలయంలో సిసి కెమేరాలను పరిశీలించగా ఆలయానికి సంబంధం లేని వ్యక్తి అమ్మవారికి పూజలు నిర్వహించడం స్పష్టంగా కనిపించింది. దీనిపై ఆలయ ఈవో తనకేమి తెలియనట్లు విచారణకు ఆదేశించి తప్పించుకునే ప్రయత్నంలో ఉన్నారని సమాచారం. దీంతో సంబంధిత వీడియోను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారని తెలిసింది.

పోలీసులపై ఉన్నతాధికారుల నుండి ఒత్తిడి

అయితే ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదులు రాకపోవడంతో మీడియాలో వచ్చిన కథనాల ద్వారా కేసును సుమోటాగా స్వీకరించాలని భావించిన పోలీసులకు తీవ్ర స్థాయిలో ఒత్తిడి మొదలైంది. ప్రభుత్వం అధికారులు, జిల్లాకు చెందిన ఓ మంత్రి నుండి పోలీసు అధికారులకు ఒత్తిడి మొదలైందని తెలిసింది. కేసు వివరాలు బయటకు రాకుండా చూడాలని ఈవో పైస్థాయి అధికారుల నుండి ఒత్తిడి చేయిస్తున్నారని సమాచారం. అయితే పోలీసులు కూడా ఈ ఘటనపై సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఈ పరిస్థితిలో ఏమి చేయాలో తెలియని స్థితిలో ఈవో ఉన్నట్లు సమాచారం. ఆలయ ఈవో తన స్వలాభం కోసమే అర్ధరాత్రి వేళ పూజలు చేయించారని పలువురు విమర్శిస్తున్నారు. అయితే సిసి ఫుటేజ్‌లో అర్ధరాత్రి వేళ ఉన్న వ్యక్తి ఎవరన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. మీడియాకు లభించిన ఫోటో కూడా అందరిని ఆశ్చర్యపరుస్తుంది.


అర్ధరాత్రి వేళ అంతరాలయంలో ఉన్న అనుమానిత వ్యక్తి

దుర్గమ్మను దర్శించుకున్న ఉపరాష్ట్రపతి

ప్రజాశక్తి -ఇంద్రకీలాద్రి

ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు దుర్గమ్మను దర్శించుకున్నారు. నగరంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు విజయవాడ వచ్చిన ఆయన ఆదివారం దుర్గగుడికి విచ్చేశారు. ఆలయ అధికారులు ఆయనకు సాధర స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో మంత్రి కామినేని శ్రీనివాస్ ఉన్నారు.అలాగే హైకోర్టు జడ్జీ శివశంకర్ దుర్గమ్మను దర్శించుకున్నారు.

2 నుండి జన్మభూమి

ప్రజాశక్తి-విజయవాడ

ఈ నెల 2 నుంచి 11 తేదీ వరకు పశ్చిమ నియోజకవర్గం (సర్కిల్–1) లో "జన్మభూమి– మాఊరు" కార్యక్రమం జరుగుతుంది. కార్యక్రమ నిర్వహణ కోసం ఇప్పటికే అధికారులు అన్ని రకాలుగా సిద్ధం చేశారు. 2న 27వ డివిజన్ భవానీపురం మసీదు వీధి, 28వ డివిజన్ హెచ్‌బి కాలనీలోని విఎంసి కళ్యాణ మండపం, 3న 25వ డివిజన్ మల్లిఖార్జున పేట కమ్యూనిటీ హాలు, 38వ డివిజన్, 4న 29వ డివిజన్ లేబర్ కాలనీ జిఎస్‌ఆర్ హైస్కూల్, 39వ డివిజన్ గాంధీజీ హైస్కూల్, 6న 32వ డివిజన్ చిట్టినగర్ ఈద్గా మహల్ రోడ్డు, 34వ డివిజన్ తేలప్రోలు హైస్కూల్‌లో జన్మభూమి నిర్వహించనున్నారు. 7న 26వ డివిజన్ షాదీఖానా, 33వ డివిజన్ విధ్యాధరపురం మర్రిచెట్టు సెంటర్, చెరువు సెంటర్, 5న 30వ డివిజన్‌లోని కెఎల్‌రావు పార్కు రోడ్డు, మధ్యాహ్నం కర్మేల్ చర్చి రోడ్డు ఎదురుగా కోళ్ల పారం సెంటర్, 8న 40వ డివిజన్‌లోని వించిపేట మహ్మద్ ఆలిపురం హైస్కూల్, 36వ డివిజన్ నైజాంగేటు మసీదు వద్ద జన్మభూమి కార్యక్రమాలు జరుగనున్నాయి.

భవానీపురంలో న్యూఇయర్ సందడి

ప్రజాశక్తి - భవానీపురం

నూతన సంవత్సర వేడుకలు భవానీపురం, విద్యాధరపురం ప్రాంతాలలో అంబరాన్ని అంటుతున్నాయి. రోడ్లపై షామియానాలు వేసి స్వీట్లు, కేక్‌ల అమ్మకాల కోసం ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజలు వివిధ స్వీట్లను కొనుగోలు చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో స్వీట్ షాపులు కొనుగోలుదారులతో సందడి నెలకొంది. పలు రకాల అసోసియేషన్లు, అపార్ట్‌మెంట్లలోని నివాసితులు న్యూ ఇయర్ వేడుకలను కలిసికట్టుగా జరిపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మహిళలు ఇళ్ళ ముందు అందమైన రంగులతో కూడిన రంగవల్లులను తీర్చిదిద్దుతున్నారు. భవానీపురం శివాలయం సెంటర్‌లోని ఆల్ఫా హోటల్ ప్రాంతం, స్వాతి సెంటర్, విద్యాధరపురం చెరువు సెంటర్, సితార సెంటర్‌లోని విభు స్వీట్ షాపు వద్ద ప్రజలకు ఇష్టమైన స్వీట్లను అమ్మకాలకు ఏర్పాటు చేశారు. నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సినిమా పాటలతో యువతీ, యువకులు ఉత్సాహ పూరిత వాతావరణంలో సందడి చేస్తున్నారు.


స్వీట్ షాపుల వద్ద కొనుగోలు దారులు

సమాజ్‌వాదీ పార్టీ బలోపేతానికి కృషి

విజయవాడ : సమాజ్‌వాదీ పార్టీని గ్రామ స్థాయి నుండి క్షేత్రస్థాయి వరకు బలపరుస్తామని ఎంపి రాజ్యసభ జాతీయనాయకులు డాక్టర్ చంద్రపాల్ సింగ్ యాదవ్ తెలిపారు. శనివారం తేజస్వీ న్యూహైట్స్, వికాసిత నగర్ కానూరు మొదటి వీధిలో ఆంధ్రప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయాలని ఉద్దేశ్యంతో 1992 ఉత్తరప్రదేశ్‌లో సమాజవాదీ పార్టీని ములాయంసింగ్ యాదవ్, అఖిలేష్ యాదవ్ స్థాపించారన్నారు. జాతీయ అధికార ప్రతినిధి, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఛార్జి రాజీవ్ రాయ్ మాట్లాడుతూ జాతీయ రాజకీయాలకు తల్లి వేరు లాంటి ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్, బీజేపీ రాజకీయాలను తరిమిగొట్టి వాటి ఉనికిని కోల్పోయే విధంగా జాతీయ పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ తమ లక్ష్యాలను ఆచరణలోకి తీసుకువెళుతున్నారన్నారు. రాష్ట్రఅధ్యక్షులు జగదీష్ యాదవ్ మాట్లాడుతూ అందరం కలిసి గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తల ను సూచించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జివిఎన్‌ఆర్‌ఎస్‌ఎస్‌ఎస్ వరప్రసాద్ మాట్లడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చే వరకు తాము పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూరల్ వార్తలు

పారిశుధ్యంపై బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - గన్నవరం

ప్రతి ఒక్కరూ పారిశుధ్యం పాటించాలని ఆదివారం గన్నవరం పట్టణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆత్మగౌరవ దీక్షలో భాగంగా చేపట్టిన ఈ ర్యాలీ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఆగిరపల్లి రోడ్డు, జాతీయ రహదారి, ఇతర పేటల్లో సాగింది. ఈసందర్భంగా తహశీల్దార్ మాధురి మాట్లాడుతూ ఎత్తను ఎక్కడ పడితే అక్కడ పారేయడం వల్ల అనేక రుగ్మతలువస్తున్నాయని అన్నారు. మానవాళి ఆరోగ్యానికి రక్షణ లేకుండా పో తుందన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేమంచిదన్నారు. ఆమె బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొనడం విశేషం.ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి జాన్సన్, పంచాయతీ కార్యదర్శి టి.విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు : మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. కంకిపాడులో ఆదివారం ఆత్మగౌరవ దీక్షలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి బందరు రోడ్డు విజయలక్ష్మి థియేటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. బహిరంగ మల విసర్జన చేయడం వల్ల అంటువ్యాధులు వ్యాపించి రోగాల పాలవుతారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ దుర్గాప్రసాద్, కార్యదర్శి సుధాకర్, పంచాయతీ సిబ్బంది, విఆర్ఒ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - విజయవాడ

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని సిఐటియు తూర్పు సిటీ కార్యదర్శి వి గురుమూర్తి అన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తూర్పు సిటీ కమిటీ జనరల్ బాడీ సమావేశం రాణిగారితోటలో ఆదివారం జరిగింది. దీనికి సిఐటియు నగర ఉపాధ్యక్షులు టి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. సమావేశానుద్దేశించి గురుమూర్తి మాట్లాడుతూ బిల్డింగ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించడంలో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందన్నారు. వారు దాచుకున్న సొమ్మును వివిధ ప్రభుత్వ పథకాల ప్రచారానికి ఉపయోగించడం దారుణమన్నారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులు, సదుపాయాలను సైతం రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు ప్రభుత్వం తన వంతుగా నిధులు కేటాయించాల్సింది పోయి, కార్మికుల సొమ్మునే వినియోగించుకోవడం దారుణమన్నారు. ఎవరి కోసమయితే వసూలు చేస్తున్నారో వారికోసమే ఆ నిధులను వెచ్చించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ సంఘంలో తమ పేర్లు నమోదు చేసుకున్న కార్మికులకు వెంటనే గుర్తింపు కార్డులను ఇవ్వాలని కోరారు. కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా ఆయా రంగాల్లోని కార్మికవర్గం పెద్ద ఎత్తున పోరాడాలని కోరారు. యూనియన్ నగర కార్యదర్శి ఎస్‌కె మీరావలి మాట్లాడుతూ 60 ఏళ్ల వయస్సు దాటిన కార్మికులకు రూ. మూడు వేలు ఫించన్ ఇవ్వాలని, ప్రమాదాలు జరిగినప్పుడు దరఖాస్తు పెట్టుకున్న నెల రోజుల లోపు సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. ఇల్లులేని కార్మికులకు వెంటనే వాటిని మంజూరు చేయాలని, డిమాండ్ల సాధన కోసం జరిగే పోరాటంలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పోరాడాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నగర నాయకులు ఫర్వేజ్, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు



సిబ్బందిని అభినందిస్తున్న సవాంగ్

ప్రజాశక్తి- మొగల్రాజపురం

పదవీ విరమణ పొందిన తొమ్మిది మంది పోలీస్ సిబ్బందికి ఆదివారం అభినందన, విడ్కోల్ సభ నిర్వహించారు. విధి నిర్వహణలో భాగంగా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్‌లు, విభాగాలలో సుదీర్ఘకాలం ఉద్యోగ భాద్యతలు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఎస్ఐ.లు ఎం.భగవాన్‌దాస్, బి.బాబురావు, రెహమాన్ జానీ, రిజర్వ్ ఏ.ఆర్.ఎస్.ఐ అబ్దుల్ ఖదీర్, హెడ్ కానిస్టేబుల్‌లు కె.వి.డి.ప్రసాద్, వి.ఆర్.ఎం.కృష్ణ, డానియేలు రాజు, కె.వి.ప్రసాదరావు, పోలీస్ కానిస్టేబుల్ ఎంవివిఆర్.సత్యనారాయణలకు విడ్కోలు సభ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిసనర్ డి.గౌతం సవాంగ్ పదవి విరమణ చేస్తున్న సిబ్బందిని పూల మాలతో సన్మానించి, పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అందించినందుకు అభినందించి వారికి ఫెన్షన్ బెనిఫిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర జాయింట్ కమిషనర్ బివి.రమణ కుమార్, అడ్మిన్ డిసిపి జె.బ్రహ్మారెడ్డి, లా అండ్ ఆర్డర్ డిసిపి గజరావు భూపాల్, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి ఎన్.రమేష్‌బాబు, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసిపి కె.కోటేశ్వరరావు, ఏఓ రాజాభాస్కర్, విజయవాడ పోలీస్ అసోసియేషన్ అద్యక్షులు సోమయ్య, సభ్యులు, పదవి విరమణ చేసిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

లూర్దు నగర్‌లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - మొగల్రాజపురం

స్థానిక మూడో డివిజన్ లూర్దు నగర్‌లో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్ఆర్ సిపి తూర్పు నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొప్పన భవకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవకుమార్‌ను నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. భవకుమార్ చిన్నారులతో కలిసి కేక్ కట్‌జేశారు. ఈ సందర్భంగా భవకుమార్ మాట్లాడుతూ లూర్దు నగర్ ప్రజలతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. స్థానికంగా ఎటువంటి సమస్యలున్నా వాటిని వెంటనే పరిష్కరిస్తానన్నారు. రాభోవు రోజుల్లో స్థానికుల ఆధరాభిమానాలు ఇలాగే ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూపిల్ ట్రస్ట్ చిన్నారులు చేసిన నృత్యాలు ఆహుతలను విశేషంగా ఆకర్షించాయి. అదే విధంగా లూర్దునగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమ నిర్వహణ కమిటీ అద్యక్షులు మాతంగి రాజేష్ కుమార్ మాట్లాడుతూ



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

కార్యక్రమానికి సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్న ప్రదీప్, కొనాల అనిల్, జోషి, వర, రమేష్, లూర్దు నగర్ యూత్, స్థానికులు పాల్గొన్నారు.

ఉడుముల రామారావుకు నివాళి



పూలమాల వేస్తున్న గద్దె రామమోహన్‌రావు

ప్రజాశక్తి- మొగల్రాజపురం

స్వాంత్రంత్య సమర యోధుడు ఉడుముల రామారావు (99) భౌతికకాయాన్ని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే గద్దె రామమోహన్ సందర్శించి, పూలమాల వేసి నివాళు లర్పించారు. ఉడుముల రామారావు శనివారం సాయంత్రం తుది శ్వాసవిడిచారు. ఈ సందర్భంగా గద్దె రామమోహన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్ళి చనిపోయేంత వరకు జాతీయ జెండాను భుజాలపై మోసిన ఉడుముల రామారావు ధన్యజీవి అని కొనియాడారు. ఈ రోజుల్లో ఇటువంటి వ్యక్తులు అరుదుగా ఉంటారన్నారు. రామారావు దేశ భక్తిని, నిరాడంబరతను మనమంతా నేర్చుకోవడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న కిరణ్

వృద్ధులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - మొగల్రాజపురం

సమాజంలో వృద్ధులకు, బడుగు బలహీన వర్గాల వారికి సేవచేయడంలో ఉన్నటువంటి తృప్తి మరో దానిలో ఉండదని బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి బి.కిరణ్ అన్నారు. స్థానిక 18వ డివిజన్‌లోని బాడవపేట నాలుగో లైనులో గొర్తి సత్యవతి ఛారిటబుల్ ట్రస్ట్, విక్రాంత్ పబ్లిషర్స్ ఆధ్వర్యంలో వృద్ధులకు, పేదవారికి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కిరణ్ మాట్లాడుతూ క్రీస్తు పుట్టిన రోజు కానుకగా చీరలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. వృద్ధులకు సేవ చేస్తునట్లుగానే పేద విద్యార్థులకు కార్పొరేట్ సంస్థలు ఉపకార వేతనాలు అందజేసి వారి అభివృద్ధికి తోడ్పాడు అందించాలని కోరారు. విక్రాంత్ పబ్లిషర్స్ అధినేత గొర్తి శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం వృద్ధులకు, వితంతువులకు, పేదలకు ఉచితంగా 200 మందికి చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ట్రస్ట్‌తో పాటు బాడవపేట పెద్దలు సహాయ సహాకారాలు అందిస్తూ పేదలకు సేవలు చేయడం మంచిపరిణామమన్నారు. సమాజంలో ఎంతో మంది ధనవంతులు ఉన్నారనీ వారిలో 50 శాతం మంది నిరుపేదల కోసం ట్రస్ట్‌లు ఏర్పాటు చేసి ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్ ఆతుకూరి రవి కుమార్, టి.రామి శంకర్, వి.మోహన్, జె.రాజా, బాడవపేట యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

22న దళితులపై దాడులకు నిరసనగా సచివాలయం దిగ్బధం

విజయవాడ : టిడిపి హయాంలో దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా దళితులు, దళితరేతల సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన సెక్రటేరియట్ దిగ్భంధన చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ దళిత సంఘాల అధికార ప్రతినిధి గూడవల్లి భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 22 సంవత్సరాలు దాటిన దళితుల శిరోమననం కేసు అతీగతీ లేకుండా వారికి కులదృవీకరణ పత్రాన్ని టిడిపి ప్రభుత్వం అడ్డుకుంటోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. విశాఖ జిల్లా జర్రిపోతుల పాలెం దళిత మహిళకు వివిస్త్రణను చేసిన కేసులో దోషులకు అండగా నిలిచిన ఎంఎల్‌ఎ బండారు సత్యనారాయణ మూర్తిని అరెస్టు చేయాలని కోరారు. పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రులో దళితుల గ్రామ బహిష్కరణ, బిఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట అగమ్యగోచరంగా ఉందని తెలిపారు. దళితులు, దళితురేతరులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సెక్రటరేట్‌ను దిగ్భంధనం చేస్తున్నామని హెచ్చరించారు. జనవరి 22న జరుగబోయే సెక్రటేరియట్ దిగ్భందన కార్యక్రమంలో దళితులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా భాస్కరరావు పేర్కొన్నారు.

బీమా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మొగల్రాజపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక మూడో డివిజన్‌లో క్రీస్తురాజపురంలో దొడ్డా జానీ గుండెపోటుతో మరణించగా అతని భార్య దొడ్డా పాపకు చంద్రన్న బీమా కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా గద్దె రామమోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు సంబంధించి ఈ జన్మభూమిలో దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు దేవానంద్, కోడూరు సుబ్రమణ్యం, గోదా రాము తదితరులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుకు భూదాహం

- రాష్ట్రంలో 15 లక్షల ఎకరాలతో భూ బ్యాంకు ఏర్పాటు
- భూ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వి.వెంకటేశ్వర్లు
- ప్రజల నోట్లో మట్టిగొడితే ఒప్పుకోం : సిపిఎం సిఆర్‌డిఎ కన్వీనర్ సిహెచ్ బాబురావు
- ఉండవల్లిలో రైతులతో బహిరంగ సభ


మాట్లాడుతున్న సిపిఎం రాజధాని డివిజన్ కన్వీనర్ సిహెచ్ బాబురావు, భూపరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - తాడేపల్లి

సిఎం చంద్రబాబుకు భూదాహం పట్టిందని, రాష్ట్రంలో 15 లక్షల ఎకరాలతో భూ బ్యాంకు ఏర్పాటుచేసి విదేశీ కంపెనీలు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్ట పూనుకున్నారని ఆంధ్రప్రదేశ్ భూపరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాజధాని అమరావతి సీడ్ క్యాపిటల్ పరిధిలోని గ్రామాల్లో భూసేకరణకు ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనకు వ్యతిరేకంగా గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఉండవల్లిలో ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. సభకు రైతు సంఘం రాజధాని డివిజన్ నాయకులు కె.జగదీశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వందెకరాలు అవసరం ఉన్నచోట వెయ్యి ఎకరాలను గుంజుకోడానికి యత్నిస్తున్నారని, ప్రపంచంలోని పెట్టుబడిదార్లకు రైతుల భూములను పందేరం చేయడానికి ఆహ్వానిస్తున్నారని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి 5వేల ఎకరాలు సరిపోతుందని, పూలింగ్ పేరుతో 35 వేల ఎకరాలు సమీకరించారని, ప్రభుత్వ, అటవి భూములు మరో 60 వేల ఎకరాలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారని తెలిపారు. రాజధానికి భూములిచ్చిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాలిచ్చారా? అని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టాన్ని మార్చడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యత్నిస్తున్న నేపథ్యంలో రైతులకు భూ పరిరక్షణ కమిటీ అండగా ఉంటుందని, పోరాటాల ద్వారానే ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టగలమని చెప్పారు.

సిపిఎం సిఆర్‌డిఎ కన్వీనర్ సిహెచ్ బాబురావు మాట్లాడుతూ తాత్కాలిక రాజధాని నిర్మాణానికే మూడేళ్లు పడితే అసలైన రాజధానికి ఎన్నేళ్లు పడుతుందని ప్రశ్నించారు. ఉండవల్లి, పెనుమాక భూములు ఏ కార్పోరే ట్ శక్తులకు ఇస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీసిన ఆయన 420గా ముద్రపడిన ఎస్ఆర్ఎం, విఐటి లాంటి సంస్థలకు గజం రూ.వెయ్యికే అప్పగిస్తున్నారని, మరికొన్ని కాలేజీలకు గజం రూ.200కు ఇస్తున్నారని, ఇది రియల్ ఎస్టేట్ వ్యాపారమేనని దుయ్యబట్టారు. రైతులు, కూలీలు నోట్లో మట్టిగొట్టే చర్యలకు తాము వ్యతిరేకమని స్పష్టంచేశారు. చట్టబద్ధంగా పోరాడుతుంటే చట్ట వ్యతిరేకంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని విమర్శించారు. హైకోర్టు సైతం ప్రభుత్వాన్ని నియంత్రించడం నిజం కాదా? అని ప్రశ్నించారు.

భూ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పూలపెద్దిరెడ్డి మాట్లాడుతూ రాజధానిలో ప్రజలందర్నీ భయభ్రాంతులు చేసి పచ్చచొక్కాల కార్యకర్తలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. భూమిపై ఉన్న రైతులకు, కౌలు రైతులకు పట్టాలు, భూమి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం పెద్దోళ్లకు భూములు కట్టబెట్టే పనిలోఉందని దుయ్యబట్టారు. 15 లక్షల ఎకరాల భూమి కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని, రైతులను లొంగదీసు కోడాన్ని సాగనివ్వబోమని అన్నారు. సభలో వివిధ పార్టీల నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, పి.కృష్ణమూర్తి, డి.బాలాజిరెడ్డి, ఎం.దామేశ్వరరెడ్డి, ఎస్‌కె.పీరుసాహెబ్, పూర్ణచంద్రరావు, ఇ.రామారావు, బి.వెంకటేశ్వర్లు, జి.సాంబశివరావు, వి.వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

పోరాడుతున్న రైతులకు అభినందనలు



మూడేళ్ల నుండి రాజధానిలో ఎన్ని ఇబ్బందులున్నా మడమ తిప్పని పోరాటం చేస్తున్న అందరికీ అభినందనలు. ప్రభుత్వ చర్యలతో భూముల రేట్లు పడిపోయాయి. వామపక్ష పోరాటాల ద్వారా వచ్చిన 2013 భూసేకరణ చట్టాన్ని ఎట్టి పరిస్థితిల్లో మార్చకూడదు. భూములివ్వని వారిపై బలప్రయోగం తగదు. 2013 భూసేకరణ చట్టాన్ని సవరణ చేయాల్సి వస్తే బాధితులకు మరిన్ని ప్రయోజనాలు చేకూర్చాలేగాని నష్టం చేయకూడదు.

పి.నరసింహారావు , ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు.

భూమి, రైతు బంధం విడదీయరానిది



భూమికి, రైతుకు ఉన్న బంధం విడదీయరానిది. భూమి నుండి రైతును దూరం చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రజల సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి పూనుకు ంటుంది. భూ సమీకరణ కింద రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. భూ సేకరణ నోటిఫికేషన్‌ఇచ్చి ప్రభుత్వం ఈ ప్రాంత రైతుల కంటిమీద కునుకు దూరం చేసింది. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, అన్ని రకాల వృత్తిదారులు ఐకమత్యంగా కదిలి ప్రభుత్వ దుర్మార్గాన్ని ఎండగట్టాలి.

జొన్నా శివశంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు.

నోటీసులు ఇచ్చి భయపెడుతున్నారు



పూలింగ్‌లో మా భూములివ్వలేదు. నోటీసులు ఇచ్చి ప్రభుత్వం మమ్మల్ని భయపెడుతోంది. నోటీసుల్లో కూడా హేతుబద్ధత లేదు. అందరం కలిసి ఈ ఉపద్రవాన్ని ఎదుర్కోవాలి.

నాగిరెడ్డి, ఉపాధ్యాయులు, నిడమర్రు.



వాస్తవాలు చెప్పరా?

సిఆర్‌డిఎ అధికారులు భూసేకరణ అవగాహనా సదస్సులంటూ సమావేశాలు నిర్వహిస్తున్నా రైతులకు వాస్తవాలు చెప్పడంలేదు. మీరు ఏ హోదాలో ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని అడిగినా సరైన సమాధానమే లేదు. సమావేశాల్లో రైతులు చట్టపరంగా సిఆర్‌డిఎలో ఉన్న అంశాల ఆధారంగా అడుగుతున్న ప్రశ్నలకు అధికారుల వైపు నుండి స్పందన నామమాత్రంగా ఉంటుంది. ఉండవల్లిలో భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిన భూముల్లో ఏ నిర్మాణాలు చేయబోతున్నారో ముందుగానే చెప్పాలి.


ఎం.రవి, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి.

భయపెడుతున్నారు

రాజధానిలో రైతులను ప్రభుత్వం భయపెడుతుంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేయడానికి పూనుకుంది. ఇష్టం వచ్చినట్లు భూసేకరణకు నోటిఫికేషన్లు ఇస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. రైతుల నుండి భూములు గుంజుకోవడానికి చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదు.

టి.రామకృష్ణారెడ్డి, వైసిపి రైతు విభాగం రాష్ట్ర నాయకులు.

ప్రమాణాన్ని ఆచరించండి



రాజ్యాంగం మీద ప్రమాణం చేసి సిఎం పగ్గాలు చేపట్టారు. చేసిన ప్రమాణాలను ఆచరించండి. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ రైతుల భూములు కాజేయాలనే ప్రయత్నాలు మానుకోండి. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ కలిసి రావలసిన సమయం ఆసన్నమైంది. ప్రజలను సమీకరించి పెద్దఎత్తున పోరాటాలు చేసినపుడే ప్రభుత్వ విధానాలు నిలువరించగలం.

దొంతిరెడ్డి వెంకటరెడ్డి, రైతుసంఘం నాయకులు.


ఐక్యంగా నిలబడదాం



అందరం ఐక్యంగా నిలబడదాం. స్థానిక ఎమ్మెల్యేతో పాటు వామపక్షాల సహకారం బాగుంది. గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోరాటానికి సిద్ధం కావాలి. ఆచరణ, ఆశయం కలగలిసి ముందుకు సాగాలి. కోర్టుల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిలువరించడానికి మా ప్రయత్నాలు మేం చేస్తున్నాం.

నిర్మలత, న్యాయవాది

అనుమతి లేకుండానే పొలంలో రోడ్డు



నా అనుమతి లేకుండానే పొలంలో రోడ్డు వేశారు. నేను పూలింగ్‌లో భూమి ఇవ్వలేదు. బలవంతంగా రైతుల భూముల్లో నిర్మాణాలు చేసే చట్టం ఏమైనా ఉందా? ఉండవల్లిలో నేను కొన్ని రోజులు లేకపోవడం వలన ప్రభుత్వం చేసిన ఈ అన్యాయాన్ని గమనించలేకపోయాం. నా భూమి నాకు దక్కడానికి ఏ పోరాటానికైనా సిద్ధం.

శింగంశెట్టి అంజిబాబు

కేసులు పెట్టి వేధిస్తున్నారు



పంట పొలాలను తగులబెట్టారు. ఆ పేరుతో రైతులను పోలీస్టేషన్లకు తరలించి రోజుల తరబడి తిప్పి ఇబ్బంది పెట్టారు. పొలాలను తగులబెట్టి మూడేల్లయినా దోషులెవరో ఈ ప్రభుత్వం తేల్చలేదు.

కె.జగదీశ్వరరెడ్డి, రాజధాని రైతు సంఘం నాయకులు.

రేపటి నుండి జన్మభూమి - మా ఊరు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఐదో విడత జన్మభూమి కార్యక్రమం మంగళవారం నుండి నిర్వహిస్తామని ఎంపిడిఒ జె.మోహనరావు మంగళవారం తెలిపారు. 2న మందడం, వెంకటపాలెం, 3న ఐనవోలు, శాఖమూరు, 4న మల్కాపురం, వెలగపూడి, 5న రాయపూడి, ఉద్దండ్రాయునిపాలెం, 6న అబ్బురాజుపాలెం, బోరుపాలెం, హరిశ్చంద్రపురం, 8న పెదపరిమి, నెక్కల్లు, 9న దొండపాడు, లింగాయపాలెం, 10న అనంతవరం, వడ్డమాను, 11న తుళ్లూరు నేలపాడులో గ్రామసభలు నిర్వహిస్తామని వివరించారు.



మాట్లాడుతున్న రావి వెంకటరమణ

బెల్టుషాపులు తెచ్చింది చంద్రబాబే

అఖిలపక్ష సభలో వక్తలు

ప్రజాశక్తి-పొన్నూరు

రాష్ట్రంలో తాగునీరు అందని గ్రామాలు లెక్కకు మించి ఉన్నాయనీ, మద్యం దొరకని గ్రామం ఒక్కటికూడా లేదని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వ తీరును తూర్పారబట్టారు. రాష్ట్రానికి బెల్టుషాపులు పరిచయం చేసింది చంద్రబాబు నాయుడేనని తేల్చిచెప్పారు. బెల్టు షాపుల కారణంగా ప్రజా జీవితాలు నాశనమవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వానికి పట్టట్లేదని విమర్శించారు. పొన్నూరు నియోజకవర్గ స్థాయిలో అఖిలపక్షం బెల్లు షాపుల నిర్వహణకు వ్యతిరేకంగా ఆదివానం ఎన్‌జి రంగా విగ్రహం వద్ద ధర్నా నిర్వహించాయి. పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ బొనిగల వేణు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ మాట్లాడుతూ బెల్టుషాపులకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటానికి మహిళలు కలసిరావాలని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బెల్టును తొలగించటానికి కృషిచేయాలన్నారు. రుణమాఫీ పేరుతో టిడిపి దొంగ హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రశ్నించిన ప్రతిపక్షాలను అణగదొక్కేస్తోందని విమర్శించారు. 30 ఏళ్లకు పైబడి ఎమ్మెల్యే కుటుంబం నియోజకవర్గాన్ని పాలించినా, ఏమైనా అభివృద్ధి చేసిందా? అని ప్రశ్నించారు. దోచుకో... దాచుకో... అన్న తీరులో పాలన సాగిపోతోందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే యం ముస్తాఫా, మాజీ ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, పొన్నూరు జడ్‌పిటిసి కోట శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎన్ రూత్‌రాణి, వివిధ రాజకీయ పార్టీ నేతలు, వామపక్ష ప్రజాతంత్రవాదులు, కులసంఘాల నాయకులు మాట్లాడారు.

జన్మభూమి ద్వారా స్థానికులతో మమేకం

రేపటి నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి - గన్నవరం

జనవరి 2వ తేదీ నుంచి 11 వ తేదీ వరకు నిర్వహించే అయిదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో స్థానికులు మమేకం అయ్యేలా నిర్వహించాలని ఎంపిపి పట్రా కవిత క్షేత్ర స్థాయి అధికారులకు సూచించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారులతో జన్మభూమి కార్యక్రమాన్ని ఒక పండుగలా నిర్వహించాలని కోరారు. అందులో ప్రజా ప్రతినిధులు అందరినీ తప్పకుండా భాగస్వాములు చేయాలని చెప్పారు.మండల ప్రత్యేక అధికారి సుధాకర్ మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మండల స్థాయి అధికారులు వచ్చే సరికి పంచాయతీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రజలంతా పాల్గొనేలా ప్రచారం చేయాలని, వారంతా కూర్చోడానికి వీలుగా కుర్చీలు, షామీయానాలు, తాగడానికి మంచినీరు వంటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కొత్తగా



కంకిపాడులో అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

ప్రభుత్వ పథకాలు మంజూరైన వారిని రప్పించి వాటిని ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా వాటిని అందించాలన్నారు.రాష్ట్ర మంత్రులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొనేందుకు అవకాశాలు ఉంటాయని, చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వై.ఇందిరాప్రియదర్శిని, ఇఓపిఆర్‌డి జాన్సన్ పాల్గొన్నారు.

పెనమలూరు : జనవరి రెండో తేదీ నుండి 11 వరకు జరగనున్న ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం సందర్భంగా నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న కార్యక్రమాలు, ఏర్పాట్లపై పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలకు చెందిన మండల రెవెన్యూ అధికారులు, ఎండిఒలతో ఉయ్యూరు మున్సిపాలిటీ కమిషనర్‌తో పోరంకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఆర్‌ఒలు మురళీకష్ణ, ఎల్లారావు, రోహిణి దేవి, ఎండిఒలు కృష్ణమోహన్, ఝాన్సీ, ఇన్‌ఛార్జి రామచంద్రరావు పాల్గొన్నారు. **(ప్ర.వి)**

కంకిపాడు : ప్రతి గ్రామంలో జన్మభూమి సభలను పండగలా నిర్వహించాలని స్థానిక శాసన సభ్యులు బోడె ప్రసాద్ అధికారులకు సూచించారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి రెండు నుంచి 11వ తేదీ వరకు ఐదో జన్మభుమి - మాఊరు కార్యక్రమాలు ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా జనవరి రెండో తేదీ పునాదిపాడు గ్రామంలో నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలో మంత్రులు లోకేష్, దేవినేని ఉమా, యనమల రామకృష్ణుడు, ఎంపి కొణకళ్ల నారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. జన్మభూమి సభలో ఇళ్ల స్థలాల పంపిణీ, రేషన్ కార్డులు, పెన్షన్ల పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జంపని వెంకటేశ్వరరావు, ఎంపిపి దేవినేని రాజా, ఎండిఒ కృష్ణమోహన్, తహశీల్దార్ ఎల్లారావు, మండల ప్రత్యేక అధికారి వెంకటరమణారెడ్డి, మండల స్థాయి అధికారులు టిడిపి నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, కె.శివయ్య, అన్నే ధనయ్య, డి.నాగేశ్వరరావు, మద్దలి సాయిబాబు, కాశరనేని కరుణ తదితరులు పాల్గొన్నారు. **(ప్ర.వి)**



వెంకయ్యను కలిసిన ఆలయ ఛైర్మన్, సభ్యులు

భూమి కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - గన్నవరం

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయాన్ని ఢిల్లీలో నిర్మించడానికి వీలుగా భూమి కేటాయించాలని కోరుతూ ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యులు, ఇఒలు ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు ఆదివారం వినతి పత్రం సమర్పించారు. నియోజకవర్గంలోని ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్టులో వెంకయ్యను ఆలయ కమిటీ ఛైర్మన్ గౌరంగబాబు, సభ్యులు ఎన్.మోహన్, పద్మశేఖర్, ఈఓ సూర్యకుమారి కలిశారు. విజయవాడ దుర్గా మల్లేశ్వర ఆలయానికి దేశంలో గుర్తింపు ఉందని, ఢిల్లీలో ఆలయనిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపుకు కృషి చేయాలని కోరారు. దీనిపై ఉప రాష్ట్రపతి స్పందిస్తూ మంచి ఆలోచన చేశారని, తనవంతు సహకారం అందిస్తామని చెప్పారు.

కంకిపాడు : దస్తావేజు లేఖరులకు లైసెన్సులు మంజూరు చేయాలని కోరుతూ ఉపరాష్ట్రపతి వెంకటయ్య నాయుడికి వినతిపత్రం అందించినట్లు తుమ్మలపల్లి హరికృష్ణ ఆదివారం విలేకరులకు తెలిపారు. రాష్ట్రంలో దస్తావేజులేఖరుల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు యలమంచలి కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. **(ప్ర.వి)**



వృద్ధులకు నిత్యావసరాలు ఇస్తున్న బస్వంత్

పేదలకు సేవ చేయడంలోనే ఆత్మసంతృప్తి

ప్రజాశక్తి - గన్నవరం

పేదలకు సేవలు చేయడంలోనే ఆత్మ సంతృప్తి కలుగుతుందని వైఎస్ఆర్‌సిపి యూత్ ఫోర్స్ అధ్యక్షులు కంభంపాటి బస్వంత్ అన్నారు. ఆదివారం గన్నవరం మండలం బుద్ధవరం బిసి కమ్యునిటీ హాలులో మహాత్మాగాంధి సేవా సమితి అధ్యక్షులు వేల్పుల బసవరావు ఆధ్వర్యంలో 200 మంది పేదలకు నిత్యావసరాలు జస్వంత్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజిక సేవలు చేస్తున్న బసవరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నక్కా బుజ్జి, యువకులు పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గన్నవరం

మాటల కంటే చేతలు చాలా గొప్పవని, మనకున్న దాంట్లో కొంత పేదలకు సాయం చేస్తే జీవితానికి సార్ధకత చేకూరుతుందని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ అన్నారు. ఆదివారం స్థానిక దళిత వాడలో తల్లీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు చీరలు, దుప్పట్లు, పేద పిల్లలకు భోజనం బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభకు జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ కలామ్ అధ్యక్షత వహించారు. వంశీ మాట్లాడుతూ మదర్ థెరిస్సా చెప్పినట్లుగా మాట్లాడే పెదవుల కన్నా సాయం చేసే చేతులుమిన్న అనే మాటను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. సమాజంలో నిరాదరణకు గురైన వృద్ధులను ఆదుకోవడం మనుషులగా మనధర్మమన్నారు. ఎంపిపి పట్రా కవిత, టిడిపి జిల్లా కార్యదర్శి మేచినేని బాబు, మండల అధ్యక్షులు పడమట సురేష్, అసోసియేషన్ అధ్యక్షులు రూతమ్మ,



కార్యక్రమంలో ఎంఎల్ఎ వంశీ

పెద్దలు కిరణ్ పాల్గొన్నారు. అనంతరం వంద మంది వృ ద్ధులకు చీరెలు, దుప్పట్లు, వంద మంది పిల్లలకు బాక్సులు ఇచ్చారు.

తల్లిదండ్రుల్లేని పిల్లలకు రూ.10 వేలు సాయం..

తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు అక్షర, తంబిలకు ఎమ్మెల్యే వంశీరూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పిల్లలను బడికి పంపించి బాగా చదివించాలని అమ్మమ్మ రామానుజమ్మకు సూచించారు. అనంతరం అన్నదానం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ ర్యాలీ

గన్నవరం : పర్యావరణ పరిరక్షణ, అందరికీ సంపూర్ణ ఆరోగ్యం పేరుతో స్పెషల్ పోలీస్ ఫోర్స్ డి.జి. మాదిరెడ్డి ప్రతాప్ ఆద్వర్యంలో చేపట్టిన శ్రీకాకుళం-అనంతపురం పోలీసు సైకిల్ ర్యాలీ ఆదివారం గన్నవరం చేరు కుంది. విమానాశ్రయం వద్ద పోలీసులు, అధికారులు స్వాగతం పలికారు. ర్యాలీలో పాల్గొన్న వారంతా అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ వచ్చే నెల 7వ తేదీ వరకు ర్యాలీ కొనసాగుతుందని చెప్పారు. డిఎస్‌పిలు ముగ్గురు, సిఐలు ఐదుగురు, ఎస్ఐలు పదిమంది, 150 మంది పోలీసులు పాల్గొన్నారని తెలిపారు. ప్రజల్లో చైతన్యంతో కూడిన మార్పు కోసం ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు. ర్యాలీ విజయవాడకు వెళ్లింది. **(ప్ర.వి)**



ప్రదర్శనలో పాల్గొన్న ముస్లిములు

సుబానీ గ్యార్మీ వేడుకలు

ప్రజాశక్తి - గన్నవరం

మండలంలోని ముస్తాబాదలో మహబూబ్ సుభానీ గ్యార్మీ వేడుకలు ఆదివారం తెల్లవారు జామున ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని హైస్కూలు రోడ్డులోని జెండాల చెట్టు వద్ద నుండి ర్యాలీ ప్రారంభించి వెదురుపావులూరు, చిన దళితవాడ, గాంధిబొమ్మ సెంటర్, గీతా మందిరం, కోఆపరేటివ్ బ్యాంకు సెంటర్ మీదుగా సుభానీ ఇంటి వరకు ర్యాలీ సాగింది. ఊరంతా డప్పులు కొడుతూ, యువకులు డాన్సులు వేస్తూ తిరిగారు. ఆతర్వాత మశీదులో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హసిన్ ఇక్బాల్ మాట్లాడుతూ సుభానీ చూపించిన బాటలో అందరూ నడవాలన్నారు. రాత్రికి అన్నసమారాధన గావించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

రోగులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - గన్నవరం

గన్నవరం శ్రీనగర్ కాలనీకి చెందిన బోయపాటి వెంటక సుబ్బమ్మ, సీతారామాంజనేయులు, శివనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం వారితల్లిదండ్రుల జ్ఞాపకార్థం లెప్రసీ కాలనీలోని కుష్టు రోగులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మన్నే సుందరరావు మాట్లాడుతూ కనీ, పెంచి, ఆస్తులు ఇచ్చిన తల్లిదండ్రులను మర్చిపోతున్న సమాజంలో చనిపోయిన తల్లిదండ్రులగుర్తుగా సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల ఎంతో మంది అభ్యాగులు, అనాధలు, రోగులకు చేయూత అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలోదాతలు సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలు



గన్నవరం గౌడ యూత్ న్యూ ఇయర్ సందడి

ప్రజాశక్తి - గన్నవరం

గన్నవరం పట్టణంలోని గాజులపేటలో గౌడ సంక్షేమ సంఘం యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొత్త ఏడాది వేడుకలు అదిరిపోయేలా జరిగాయి. కుర్రాళ్లు వేదికను ప్రత్యేకంగా అలంకరించారు. డిటిఎస్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. దీంతో పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది సినిమాలో బొంగ్రాల్లా కళ్లు తిప్పింది..పాటకు మోదుగుమూడి సరిత చేసిన డాన్సు అందరినీ ఆకట్టుకుంది. ప్రవేట్ సాంగ్ గున్నా గున్నా మామిడి పాట కుర్రాళ్లను ఉర్రూతలూగించింది. అందరూ స్టేజ్ మీదకు వెళ్లి చిందులు తొక్కారు. ఎన్టీఆర్, ప్రభాస్, అల్లు అర్జున్ సినిమాల్లోని పలు పాటలకు పిల్లలు ఉత్సాహంగా డాన్సులు చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు అనగాని రవి మాట్లాడుతూ కొత్త ఏడాదికి ఉత్సాహపూరిత వాతావరణంలో స్వాగతం పలకడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కుర్రాళ్లు కలిసి ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా ఐక్యతకు మార్గం ఉంటుందన్నారు. పిల్లలు ఆనందంగా కేరింతలు కొట్టడానికి ఇదొక వేదిక అన్నారు. యువత తమ అభిరుచికి తగ్గట్టుగా స్నేహితులతో కలిసి జోష్‌ని కొనసాగిస్తూ న్యూయియర్‌కి స్వాగతం పలికారు. అనంతరం భోజనాలు పెట్టారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు నటరాజ్, తాతేశ్వరరావు, చందు, వెంకటేష్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : పెనమలూరు మండలంలో పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ప్రజానీకం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని చర్చీలు, దేవాలయాలు, పాఠశాలలు, హోటళ్లు, స్వచ్ఛంధ సంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో కేకులను కట్‌జేసి నూతన సంవత్సర సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు కేక్‌లు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దలు గత స్మతులను గుర్తుచేసుకోగా పిల్లలు మహిళలు కొత్త దుస్తులతో అందంగా ముస్తాబై నూతన సంవత్సరానికి తమదైన శైలిలో స్వాగతం పలికారు. యువతీ యువకులు కేరింతలతో నత్యాలు చేస్తూ టపాసులు కాలుస్తూ అర్ధరాత్రి నుండే నూతన సంవత్సర ఉత్సవాలను ఆస్వాధిస్తూ గడిపారు. ఫాదర్ ఎన్.కిషోర్ ఆధ్వర్యంలో పెనమలూరు, పెద్దపులిపాక, చోడవరం, తాడిగడప, శ్లీవ నగర్ ఆర్‌సిఎం చర్చీల్లో విశ్వాసకులు ప్రార్ధనలు జరిపారు. యనమలకుదురు హోసన్నా చర్చిలో ఫాస్టర్ రమేష్ వాక్యోపదేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు వాకిళ్లలో పలు రంగులతో ముగ్గులు వేసి, పూలు జల్లి నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. స్వీట్ దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, సినిమాహాల్‌లు, వైన్ షాపులు, పలురకాల వ్యాపార సంస్థలు రెండు రోజులుగా జనంతో కిటకిటలాడాయి. **(ప్ర.వి)**



వేడుకల్లో నత్యం చేస్తున్న తాడిగడప విద్యార్థులు

జగ్గయ్య నటన అపూర్వం

ప్రజాశక్తి-సత్యనారాయణపురం

ప్రముఖ నటుడు పద్మభూషణ్ కొంగర జగ్గయ్య 91 జయంతిని మహానటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్‌లోని కళాపీఠం కార్యాలయంలో ఆదివారం జగ్గయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు మాట్లాడుతూ విలక్షణమైన, గంభీరమైన కంఠంతో జగ్గయ్య ప్రేక్షకులను ఆకట్టుకున్నారని చెప్పారు. ఏ పాత్ర ధరించినా దానిలో ఇమిడిపోయే వారన్నారు. జగ్గయ్య నటన అపూర్వమని కొనియాడారు. కేవలం సినిమాల్లోనే కాకుండా రాజకీయాల్లో కూడా రాణించారని చెప్పారు. రేడియో వ్యాఖ్యతగా శ్రోతలను అలరించారని పేర్కొన్నారు. కళాపీఠం గౌరవాధ్యక్షుడు ప్రభల శ్రీనివాస్ మాట్లాడుతూ జగ్గయ్యను నేటి తరం నటులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో 2017 సంవత్సరం 81 కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ నేటి తరం వారికి పాతతరం నటీనటుల గురించి తెలియజేయాలన్న ఉద్దేశ్యంతో జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించి స్మరించుకోవడం జరుగుతుందన్నారు. త్వరలోనే తుమ్మలపల్లి కళాక్షేత్రంలో హాస్యనటుడు రాజబాబు విగ్రహాన్ని ఆవిష్కరించటం జరుగుతుందన్నారు. సూర్యకాంతం విగ్రహాన్ని కూడా నగరంలో ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రికళా పీఠం సభ్యులు కొత్త.జ్యోతి, వి.సంపత్, నారుమంచి నారాయణ, మురళీ తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యకు నివాళులర్పిస్తున్న తుర్లపాటి, సావిత్రికళాపీఠం సభ్యులు

అలరించిన భక్తప్రహ్లాద హరికథ

ప్రజాశక్తి-సత్యనారాయణపురం

భాషా సాంస్కృతిక శాఖ వారంతపు కార్యక్రమం ఆనందలహరిలో భాగంగా నిర్వహించిన హరికథా గానం అలరించింది. దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో మచిలీపట్నంకు చెందిన భాగవతారిణి కె.శారద 'భక్త ప్రహ్లాద' హరికథా గానం చేశారు. ఆదిభట్ల నారాయణదాసు రచించిన ఈ హరికథ ఎంతో హృద్యంగా వివరించారు. కళల సమాహారంగా జరిగిన కథాగానానికి వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై ఎస్.అమ్ముల ప్రసాద్‌లు సంగీత సహకారం అందించారు. కార్యక్రమంలో సంగీత కళాశాల ప్రిన్సిపల్ కె.ఎస్.గోవిందరాజన్, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



హరికథా గానం చేస్తున్న కె.శారద

రోగులకు సేవలందించడంలో నర్సుల పాత్ర కీలకం

డాక్టర్ ఎం.జగన్మోహనరావు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

నర్సింగ్ వృత్తి సేవాభావంతో కూడుకున్నదని, రోగికి సేవలందించడంలో నర్సులు పాత్ర కీలకమని పలువురు వక్తలు అన్నారు. ఎం.జి.రోడ్డులోని ఉషా స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల 19వ బ్యాచ్ క్యాపింగ్ సెర్మనీ, ల్యాంప్ లైటింగ్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.జగన్మోహనరావు పాల్గొని మాట్లాడుతూ నర్సింగ్ విద్యను పూర్తి చేసుకున్న వారు మంచి సేవలందించాలని కోరారు. వైద్యులు వైద్యం చేస్తారని, కాని రోగిని పూర్తిస్థాయిలో కోలుకునే విధంగా చేయడంలో నర్సింగ్ వృత్తి ప్రధానమైనది తెలిపారు. ఉషా స్కూల్ ఆఫ్ నర్సింగ్ సంస్థ చక్కని సేవలందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో త్రిపుర గ్యాస్ట్రో అండ్ గైనిక్ క్లినిక్ వైద్యులు డాక్టర్ పి.హిమబిందు, మాజీ శాసన మండలి సభ్యులు చిగురుపాటి వరప్రసాద్, ఉషా కార్డియాక్ సెంటర్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ వై.కీర్తిరావు, కార్డియాక్ అనస్థిటిస్టు డాక్టర్ సి.హెచ్.కీర్తి, ఉషా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సిఇవో డాక్టర్ వై.శ్రీకాంత్‌రావు, రేడియాలజిస్టు డాక్టర్ కె.ప్రేమలత, ప్రముఖ పాత్రికేయులు పి.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాచ్ క్యాపింగ్ సెర్మనీలో పాల్గొన్న జగన్మోహనరావు



ల్యాంప్ లైటింగ్‌లో పాల్గొన్న నర్సులు

క్రికెట్ అకాడమీ ప్రారంభం

ప్రజాశక్తి -విజయవాడ స్పోర్ట్స్

ఐజిఎం స్టేడియంలో ఆధునిక హంగులతో క్రికెట్ అకాడమిని ఏర్పాటు చేశామని ఏసిఏ ప్రధాన కార్యదర్శి చుక్కపల్లి అరుణ్ కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఐజిఎం స్టేడియంలోని కృష్ణా జిల్లా క్రికెట్ అకాడమీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టేడియంలో నెట్‌లు 20 సంవత్సరాలుగా ఉన్నాయని, పలు దశల్లో నెట్‌లను అభివృద్ధి చేశామని తెలిపారు. నీటి మునికలో ఉండే పిచ్‌ను ఆధునిక హంగులతో సుమారు రూ.25 లక్షల వ్యయంతో నూతనంగా 8 క్రికెట్ నెట్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఆరు టర్ఫ్, ఒక సిమెంట్, ఒక ఆస్ట్రో పిచ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన పిచ్‌లను జనవరి 1న నరసాపురం పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు ప్రారంభించనున్నారని చెప్పారు. అకాడమీలో సెలక్టెడ్ క్రికెటర్లకు ఉచితంగా అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఏ.యల్లారావు, మీడియా మేనేజర్ మోహన్, ఏసిఏ మహిళా క్రికెట్ అభివృద్ధి అధికారి బి.బాపూజీ, తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ అకాడమీని పరిశీలిస్తున్న ఏసిఏ ప్రతినిధులు

స్పోర్ట్స్ మీట్‌లో సత్తా చాటిన సిద్ధార్థ విద్యార్థులు

ప్రజాశక్తి -విజయవాడ స్పోర్ట్స్

కృష్ణా జిల్లా జూనియర్ కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా నగరంలోని వి.పి.సిద్ధార్థ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న జిల్లా జూనియర్ కళాశాలల స్పోర్ట్స్ మీట్‌లో నగరానికి చెందిన సిద్ధార్థ కళాశాల జూనియర్ జట్టు విశేష ప్రతిభ కనబరిచింది. బాలికల విభాగంలో దుర్గామల్లేశ్వర మహిళా కళాశాల జూనియర్ జట్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. వ్యక్తి గత విభాగంలో ఉయ్యూరుకు చెందిన ఎజిఅండ్ఎస్‌జి కళాశాల, అలాగే సిద్ధార్థ కళాశాల విద్యార్థి ఐ.శశి కుమార్, బాలికల వ్యక్తి గత విభాగంలో చాంపియన్‌గా సిద్ధార్థ విద్యార్థిని, అంతర్జాతీ క్రీడాకారిణి డి.జ్యోతికా శ్రీ నిలిచింది. కార్యక్రమంలో సిద్ధార్థ కళాశాల డైరక్టర్ మండవ సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. శాయ్ అథ్లెటిక్స్ కోచ్ డి.వి.వి.వినాయక్ ప్రసాద్ క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ప్రతినిధి సి.హెచ్.శేషు, పిడిలు రవికాంతా, పి.నారాయణ, ఎన్.వి.వి.ఎస్.ప్రసాద్, సరస్వతి, పద్మా కుమారి, జిల్లా గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సంజీవ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

లోటస్‌లో బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి- విజయవాడ స్పోర్ట్స్

నగరంలోని లోటస్ ల్యాండ్ మార్క్ సెక్టర్-2లో డిసెంబర్ 27 నుండి 31వ తేదీ వరకు జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్ మ్యాచ్‌లో సి.హెచ్.శివప్రసాద్, హరనాథ్ రెడ్డి విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో ఏ.సురేష్, ప్రసాద్ రావులు నిలిచారు. ఈ పోటీలను లోటస్ ల్యాండ్ మార్క్ వారు నిర్వహించారు. పోటీలకు కె.వి.చంద్రమోహన్, పి.మురళీ కృష్ణ తదితరులు పూర్తి సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు వెలంపల్లి పాల్గొని విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సాయి కిరణ్, ఎస్.విజయ్, లోటస్ ల్యాండ్ మార్క్‌లో నివాసితులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు